
సోమవారం 8, జూన్ 2026

https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు


### ఎరువుల పంపిణీలో పారదర్శకతకు ఏపీఎఐఎంఎస్ 2.0 దోహదం

అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు టెలికాన్ఫరెన్స్



5

## ప్రజల్లోకి ప్రజా ప్రభుత్వ విజయాలు



- తిరుపతి, అమరావతి, విశాఖలో సభలు
- కూటమి శ్రేణులు విజయవంతం చేయాలి
- కుప్పం నేతలతో చంద్రబాబు సమీక్ష

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి రెండేళ్లు అయిన సందర్భంగా చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు కూటమి నేతలకు దిశానిర్దేశం చేశారు. డబుల్ ఇంజిన్ సర్కార్ పాలన విజయాలపై రాష్ట్రంలో నిర్వహించే బహిరంగ సభలను విజయవంతం చేయాలని సూచించారు. రాజధాని అమరావతిలో కూటమి పక్షాల నేతలతో ఆదివారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ 9న తిరుపతి వేదికగా జరగనున్న భారీ బహిరంగ సభపై కుప్పం నాయకులతో చర్చించారు. సభకు కూటమి పార్టీల కార్యకర్తలను ఆహ్వానించాలని కోరారు.

2





## మాస్కోలో అతిపెద్ద అణుశక్తి మ్యూజియం సందర్శించిన మంత్రి నారా లోకేష్

రష్యా పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేష్ మాస్కోలోని అతిపెద్ద అణుశక్తి మ్యూజియంను సందర్శించారు. ఈ మ్యూజి యం 25 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో 7 అంతస్తుల్లో ఉంటుంది. సోవియట్ అణు ప్రాజెక్ట్ ప్రారంభ దశల నుంచి ఆధునిక అణుశక్తి రంగ అభివృద్ధి వరకు విస్తరించిన ప్రదర్శ నలు మ్యూజియంలో ప్రత్యేకం. మాస్కో ప్రభుత్వం, రొసాటమ్ స్టేట్ కార్పొరేషన్ సంయుక్తంగా ఈ మ్యూజియాన్ని అభివృద్ధి చేసింది.

2

## గిరెడ్మెట్ ప్రతినిధులతో లోకేష్ భేటీ

- ఉత్తరాంధ్రలో రేర్ ఎర్త్ ఎలిమెంట్ రిఫైనింగ్ హబ్ స్థాపనను పరిశీలించండి
- నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

3

రష్యాకు చెందిన ప్రముఖ రేర్ ఎర్త్ మినరల్స్ సంస్థ గిరెడ్మెట్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులతో లోకేష్ మాస్కోలో సమావేశమయ్యారు. గిరెడ్మెట్ వంటి సంస్థలతో సాంకేతిక భాగస్వామ్యం భవిష్యత్తులో విలువైన అవకాశాలను తెరుస్తుంది. విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతాల్లో ఉన్న భారీ ఖనిజ వనరులను ఆధారంగా డీప్ ప్రాసె సింగ్ రేర్ ఎర్త్ ఎలిమెంట్ రిఫైనింగ్ హబ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటులో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.



## సత్యనారాయణ గారూ.. కలుద్దాం!

- పెద్దాయన అభిమానానికి స్పందించిన సీఎం చంద్రబాబు





పశ్చిమగోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం కామధేనువు లంక గ్రామానికి చెందిన సానబోయిన సత్యనారాయణకు చంద్రబాబు అంటే ఎంతో అభిమానం. ఆయనను ఒక్కసారైనా కలవాలని ఆయన చెబుతుండగా ఓ యువకుడు వీడియో తీసి పోస్ట్ చేశారు. అది సోషల్ మీడియాలో వైరల్ అయింది. తనను కలవాలన్న ఆ వృద్ధుని కోరికపై స్పందిస్తూ 'సత్యనారాయణ గారూ.. రేపు సిద్ధాంతంలో కలుద్దాం' అని సీఎం చంద్రబాబు 'ఎక్స్' వేధికగా ఆదివారం పోస్ట్ పెట్టారు. కాగా సిద్ధాంతంలో సోమవారం 'మీ భూమి- మీ హక్కు' కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరు కానున్నారు.



## యోగాంధ్ర.. రిజిస్ట్రేషన్ల జోరు

- కోటిమంది భాగస్వామ్యం ప్రభుత్వ లక్ష్యం
- తొలి రోజు 25 వేలమంది పేర్లు నమోదు
- రాష్ట్రవ్యాప్తంగా యోగా సందడే సందడి
- మాస్టర్ ట్రైనర్ల ద్వారా 50,752 మందికి శిక్షణ

4


## ప్రతి కాల్ వెనుక ఒక ప్రాణం... ప్రతి స్పందన వెనుక 108

- గోల్డెన్ అవర్‌లో గోల్డెన్ సర్వీసెస్..
- 108 అంబులెన్స్‌ల రూపురేఖలు మార్చేసిన కూటమి ప్రభుత్వం
- ఒక్క ఏడాదిలోనే 7.78 లక్షల అత్యవసర కేసులకు సత్వర స్పందన
- భవ్య హెల్త్ కేర్ ఆధ్వర్యంలో మరో మైలురాయి

5

CALL 108 EMERGENCY
• MEDICAL • POLICE • FIRE

# ప్రజల్లోకి ప్రజా ప్రభుత్వ విజయాలు



- బహిరంగ సభలు విజయవంతం చేయాలి
- సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు
- కూటమి నేతలతో జూమ్ మీటింగ్

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి రెండేళ్లు అయిన సందర్భంగా చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు కూటమి నేతలకు దిశానిర్దేశం చేశారు. నరేంద్ర మోదీ ప్రధానిగా పాలన పగ్గాలు చేపట్టి 12 ఏళ్ల అయింది. ఈ నేపథ్యంలో డబుల్ ఇంజిన్ సర్కార్ పాలన విజయాలపై రాష్ట్రంలో నిర్వహించే బహిరంగ సభలను విజయవంతం చేయాలని సూచిం చారు. ఆదివారం రాజధాని అమరావతిలో కూటమి పక్షాల నేతలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జూన్ 9వ తేదీన తిరుపతి వేదికగా జరగనున్న భారీ బహిరంగ సభ గురించి వారితో చర్చించారు. ఈ సభకు ఆయా పార్టీల కార్యకర్త లందరిని ఆహ్వానించాలని వారిని కోరారు. అలాగే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వారికి సోదాహరణగా వివరించాలని వారికి స్పష్టం చేశారు. మూడు ప్రాంతాలలో నిర్వహించే సభలను విజయవంతం చేయాలని వారిని కోరారు. టీడీపీ నుంచి పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు, జనసేన నుంచి మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ పి.హరిప్రసాద్, బీజేపీ నుంచి పీవీఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజర య్యారు. ఏపీలో రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనతో పాటు కేం ద్రంలో మోదీ ప్రభుత్వం ఏర్పాటై 12 ఏళ్లు పూర్తి చేసుకోనుంది. ఈ నేపథ్యంలో డబుల్ ఇంజిన్ సర్కార్ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఈ సమావేశంలో నేతలు చర్చించారు. అలాగే కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతల విమర్శల జోరుకు అడ్డుకట్ట వేయాలని భావించారు. ఈ నేపథ్యంలో డబుల్ ఇంజిన్ సర్కార్ పాలన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో జూన్ 9న తిరుపతి, జూన్ 12న రాజధాని అమరావతి, జూన్ 15వ తేదీన విశాఖపట్నం వేదికగా ఈ భారీ బహిరంగ సభలు నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించా రు. దాంతో ఈ సభలను విజయవంతం చేయాలని ఈ జూమ్ మీటింగ్‌లో ఆయా పార్టీల అగ్రనేతలను సీఎం చంద్రబాబు ఆదేశించారు.

# మాస్కో అణుశక్తి మ్యూజియాన్ని సందర్శించిన మంత్రి లోకేష్





మాస్కో (రష్యా): రష్యాలోని అతిపెద్ద అణుశక్తి మ్యూజియం (మాస్కో)ను మంత్రి నారా లోకేష్ సందర్శించారు. ఈ మ్యూజియం 25 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో 7 అంతస్తుల్లో ఉంటుం ది. సోవియట్ అణు ప్రాజెక్ట్ ప్రారంభ దశల నుంచి ఆధునిక అణుశక్తి రంగ అభివృద్ధి, భవిష్యత్తు శాస్త్రీయ అవకాశాల వరకు విస్తరించిన ప్రదర్శనలు మ్యూజియంలో ప్రత్యేకం. మ్యూజియం లో ఇంటరాక్టివ్ ప్రదర్శనలు, శాస్త్ర ప్రయోగశాలలు, గైడెడ్ టూర్లు ఉండటం వల్ల ఇది ప్రజలకు విజ్ఞానపరమైన అనుభవాన్ని అందిస్తోంది. 2023 నవంబరులో ప్రారంభమైన ఈ మ్యూజియం ఇప్పటికే విశేష ప్రజాదరణ పొందింది. విజ్ఞానం, చరిత్ర, సాంకేతి కతల సమన్వయ వేదికగా నిలుస్తోన్న ఈ మ్యూజియాన్ని 80 దేశా లకు పైగా చెందిన 35 లక్షల మందికి పైగా సందర్శించినట్టు నిర్వాహకులు లోకేష్‌కు వివరించారు. ఒకేసారి 2,100 మంది వరకు సందర్శకులను ఆతిథ్యం ఇవ్వగల సామర్థ్యం ఈ కేంద్రానికి ఉంది. మాస్కో ప్రభుత్వం, రొసాటమ్ స్టేట్ కార్పొరేషన్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ మ్యూజియం అణుశక్తి చరిత్రను మాత్ర మే కాకుండా శాంతిపూర్వక అణు వినియోగ విజయాలను కూడా సమగ్రంగా పరిచయం చేస్తోంది.






# గిరెడ్మెట్ ప్రతినిధులతో లోకేష్ భేటీ



- ఉత్తరాంధ్రలో రేర్ ఎర్త్ ఎలిమెంట్
- రిఫైనింగ్ హబ్‌ను పరిశీలించండి
- నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్
- ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

మాస్కో(రష్యా): రష్యాకు చెందిన ప్రముఖ రేర్ ఎర్త్ మినరల్స్ సంస్థ గిరెడ్మెట్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులతో మంత్రి నారా లోకేష్ మాస్కోలో సమావేశమయ్యారు. భారతదేశానికి.. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు గిరెడ్మెట్ వంటి సంస్థలతో సాంకేతిక భాగస్వా మ్యం భవిష్యత్తులో విలువైన అవకాశాలను తెరుస్తుంది. విశాఖ పట్నం, శ్రీకాకుళం ప్రాంతాల్లో ఉన్న భారీ ఖనిజ వనరులను ఆధారంగా డీప్ ప్రాసెసింగ్/ రేర్ ఎర్త్ ఎలిమెంట్ (ఆర్ఈఈ) రిఫైనింగ్ హబ్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని కోరారు. భారతదేశంలో విస్తరిస్తున్న భారతదేశపు విస్తరిస్తున్న ఈవీ, పవన విద్యుత్ మార్కెట్లకు సరఫరా చేయడానికి, గిరెడ్‌మెట్ ప్రాసెసింగ్ టెక్నాలజీని ఉపయోగించి నెల్లూరులో ఫుల్ సైకిల్ రేర్-ఎర్త్ శాశ్వత అయస్కాంతాల తయారీ కోసం నియోడైమియం మాగ్నెట్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయడానికి భాగస్వాములు కావాలని కోరారు. భారతీయ టెక్ కారిడార్‌లో సిద్ధంగా ఉన్న ప్లగ్-అండ్-ప్లే ప్రయోగశాలల మద్దతుతో మెటలర్జీ అల్ట్రా-ప్యూర్ సెమీకండక్టర్/ ఎలక్ట్రానిక్ మెటీరియల్స్ ల్యాబ్ సహ స్థాపనకు చొరవచూపాలని విజ్ఞప్తి చేశారు. పారిశ్రామిక వ్యర్థాలు, మైనింగ్ టెయిలింగ్స్ నుంచి వ్యూహాత్మక అరుదైన లోహాలను వెలికితీయ డానికి, యాజమాన్య వెలికితీత సాంకేతికతలను అమలు చేయ డంలో భాగస్వామ్యం వహించాలని విజ్ఞప్తిచేశారు.

### కీలక పరిశోధన-డిజైన్ సంస్థ గిరెడ్మెట్

1931లో స్థాపించబడిన గిరెడ్మెట్ సంస్థ మాస్కో కేంద్రంగా పనిచేస్తూ రొసటమ్ శాస్త్ర, సాంకేతిక వ్యవస్థలో కీలక పరిశోధన-డిజైన్ సంస్థగా కొనసాగుతోంది. రేర్ ఎర్త్ మూలకాలు, కీలక లోహాలు, సెమీ కండక్టర్ పదార్థాలు, అధిక శుద్ధి రసాయనాల రంగాల్లో ఈ సంస్థకు ప్రత్యేక నైపుణ్యం ఉంది. గిరెడ్మెట్ సంస్థ జాతీయ సాంకేతిక స్వావలంబనను బలోపేతం చేసే కేంద్రంగా పనిచేయడంతో పాటు అంతర్జాతీయ సహకారాల ద్వారా కూడా తన ప్రభావాన్ని విస్తరించుకుంటోంది. మాస్కోలోని ప్రత్యేక ప్రయోగశాలలు, పైలట్ స్థాయి పరీక్షా సౌకర్యాలు, డిజైన్ కేంద్రా లు రొసటమ్ విస్తృత పారిశ్రామిక నెట్‌వర్క్‌తో అనుసంధానమై పనిచేయడం వల్ల ఈ సంస్థ పరిశోధనతో పాటు పారిశ్రామిక అమలు సామర్థ్యం కలిగిఉంది. ముఖ్యంగా కీలక ఖనిజాలు, బ్యాటరీ రీ సైక్లింగ్, రేర్ ఎర్త్ ప్రాసెసింగ్, అధునాతన పదార్థాల అభివృద్ధి వంటి రంగాల్లో భారతదేశంతో భాగస్వామ్య అవకాశా లు పెరుగుతున్నాయి.










# హెల్తీ వెల్తీ హ్యాపీ స్టేట్‌గా ఏపీ

- యోగాతోనే శారీరక ఆరోగ్యం.. మానసిక ఉల్లాసం
- మన జీవన విధానంలో యోగా భాగం చేసుకోవాలి
- మంగినపూడి బీచ్‌లో యోగాడే వేడుకల్లో మంత్రి కొల్లు

మచిలీపట్నం (చైతన్య రథం): యోగా అనేది మన జీవన విధానంలో భాగం చేసుకోవడం ద్వారా మాత్రమే ఆరోగ్యకరమైన జీవితం సాధ్యమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో నిర్వహించిన 12వ అంతర్జాతీయ యోగా డే వేడుకల్లో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణతో కలిసి పాల్గొన్నారు.

జూన్ 21, 2014 నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నారు. గత ఏడాది కూడా పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ దీనిలో భాగస్వాములై భారీ ఎత్తున నిర్వహించుకున్నారు. శారీరక, మానసిక దృఢత్వానికి యోగా చాలా



అవసరం. నెల రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో లక్షలాది మంది పాల్గొనడం జరిగింది. అలాగే ప్రధానమంత్రి ఆధ్వర్యంలో విశాఖపట్నం సముద్ర తీరంలో దాదాపు ఐదున్నర లక్షల మంది పైగా కార్యక్రమంలో పాల్గొన్నారు. మచిలీపట్నంలో కూడా పెద్ద ఎత్తున యోగా వేడుకలు నిర్వహించారు.

ఈ ఏడాది మచిలీపట్నంలో నిర్వహించిన యోగా వేడుకలో పెద్ద ఎత్తున మహిళలు, యువత పాల్గొనడం హర్షణీయం. దైనందిన కార్యక్రమాల్లో యోగాను ప్రతి ఒక్కరూ భాగం చేసుకోవాలి. ఇది మన భారతీయ సంస్కృతిలో ఒక భాగం. యోగాతో అనేకమంది యోగులు అద్భుతమైన గ్రంథాలు మనకు అందించారు. ముఖ్యంగా మహిళలు శారీరకంగా దృఢంగా మారేందుకు యోగా అత్యంత అవసరం. షుగర్, బీపీ వంటి అనారోగ్యాల నుండి మనల్ని మనం కాపాడుకోవాలంటే రెసిస్టెన్స్ పవర్ పెంపొందించేందుకు యోగా అత్యుత్తమ మార్గం. అందరం యోగాను అలవాటు చేసుకుందాం. భారతదేశాన్ని సంపూర్ణ ఆరోగ్యమంతమైన, హెల్తీ, వెల్తీ అండ్ హ్యాపీ స్టేట్‌గా మన రాష్ట్రాన్ని మార్చుకుందామని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.

### బీఆర్‌టీఎస్ రోడ్డులో

# ఘనంగా పోలీసు యోగాంధ్ర

***గంజాయి రహిత ఏపీ, ఆరోగ్య ఏపీ, ఆనంద ఏపీ లక్ష్యం: హోంమంత్రి అనిత***



విజయవాడ (చైతన్య రథం): 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 7నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర పేరుతో ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనరేట్ పరిధిలో బీఆర్‌టీఎస్ రోడ్డువద్ద పోలీసు శాఖలో మానసిక, శారీరక ఆరోగ్యం పెంపొందించడానికి నగర పోలీసు కమిషనర్ వి. రాజశేఖర్‌బాబు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీసు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించబడింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హోంమంత్రి అనిత హాజరయ్యారు. సుమారు 5,000 మంది యోగా ఔత్సాహికులు పాల్గొని యోగాసనాలు అభ్యసించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ ఆరోగ్యాన్ని తామే కాపాడుకోవాలనే సంకల్పంతో యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. భారతీయ సంస్కృతిలో వేల ఏళ్ల చరిత్ర కలిగిన యోగాను ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందేలా చేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకే దక్కుతుందన్నారు. 2014లో ఐక్యరాజ్యసమితి వేదికగా అంతర్జాతీయ యోగా దినోత్సవానికి 150కు పైగా దేశాలు మద్దతు తెలిపాయని గుర్తు చేశారు. యోగాకు ప్రత్యేక ఖర్చులు అవసరం లేదని, పేదవాడు నుంచి ధనికుడి వరకు ప్రతి ఒక్కరూ కేవలం ఒక మ్యాట్‌తో యోగాను అభ్యసించవచ్చని పేర్కొన్నారు. జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం వరకు నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్, ఆనంద ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

### క్వారీ ప్రాంత నీటి సమస్యకు

# రూ.95 కోట్లతో శాశ్వత పరిష్కారం

- ముంపు సమస్యల నివారణకు రూ.25 కోట్లతో సమగ్ర ప్రణాళిక
- అమృత్ 2.0 పథకం కింద భారీ అభివృద్ధి పనులు
- పబ్లిక్ హెల్త్ అధికారులతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సమీక్ష

రాజమహేంద్రవరం (చైతన్య రథం): క్వారీ ప్రాంత ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కూటమి ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. అమృత్ 2.0 పథకం కింద సుమారు రూ.95 కోట్ల వ్యయంతో సమగ్ర తాగునీటి ప్రాజెక్టును చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులతో నిర్వహించిన విస్తృత సమీక్ష సమావేశంలో ఆయన ఈ విషయాలు వెల్లడించారు.

ఈ సందర్భంగా అధికారులు ప్రాజెక్టు నమూనాను ఎమ్మెల్యేకు వివరించి, అమలు కార్యాచరణపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రాజెక్టును ఏడాదిలోగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఆధునిక సదుపాయాలతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం, రోజుకు 20 ఎంఎల్డీ సామర్థ్యంతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు, లా హాస్పిన్ సమీపంలో శాశ్వత రా వాటర్ పికప్ పాయింట్ నిర్మాణం, సమగ్ర పైప్‌లైన్ వ్యవస్థ అభివృద్ధి వంటి కీలక పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే క్వారీ ప్రాంత ప్రజలకు నిరంతర, నాణ్యమైన తాగునీటి సరఫరా అందుబాటులోకి వచ్చి దశాబ్దాల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, మౌలిక వసతులను బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. నగరంలోని ప్రతి ప్రాంతానికి సమాన అభివృద్ధి అందేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు.



**ముంపు సమస్యలకు సమగ్ర పరిష్కారం**

వర్షాకాలంలో నగర ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్న ముంపు సమస్యల పరిష్కారంపైనా సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. తిలక్ రోడ్, హైటెక్ బస్‌స్టాండ్, నల్లా చానల్ పరిసర ప్రాంతాలు, అంబేద్కర్ నగర్, అశోక్ కళ్యాణ మండపం ప్రాంతాలు, వై-జంక్షన్ వంటి లోతట్టు ప్రాంతాల్లో తరచూ ఏర్పడుతున్న నీటి ముంపును శాశ్వతంగా నివారించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. హైటెక్ బస్‌స్టాండ్ నుంచి నల్లా చానల్ వరకు రహదారుల ఎత్తు పెంపు, డ్రైనేజీ కాలువల విస్తరణ, నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్న ప్రాంతాల గుర్తింపు వంటి అంశాలపై సాంకేతిక అధ్యయనం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఈ పనుల అంచనా వ్యయం సుమారు రూ.25 కోట్లుగా ఉండవచ్చని అధికారులు వివరించగా, దీర్ఘకాలిక ప్రయోజనం దృష్ట్యా అవసరమైతే మరింత సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. త్వరలోనే ఉన్నతాధికారులు, సాంకేతిక నిపుణులతో మరో సమీక్ష సమావేశం నిర్వహించి తుది నిర్ణయాలు తీసుకుని పనులను ప్రారంభిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. నగర అభివృద్ధి, ప్రజల సౌకర్యాలే తమ ప్రభుత్వానికి ప్రాధాన్యమని పేర్కొన్నారు.

## పిడుగులతో వర్షాలు.. పలు జిల్లాల్లో వడగాడ్పులు

***జాగ్రత్తలు తీసుకోవాలంటూ విపత్తుల నిర్వహణ సంస్థ సూచన***

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో పిడుగులతో కూడిన వర్షాలు, కొన్ని చోట్ల ఎండ ప్రభావం చూపుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ పేర్కొన్నారు.

**పిడుగులతో కూడిన వర్షాలు**

కర్ణాటక పరిసర ప్రాంతాల నుండి కోస్తాంధ్ర తీరప్రాంతం వరకు విస్తరించి ఉన్న ద్రోణి ప్రభావంతో సోమ, మంగళవారాల్లో అల్లూరి, పోలవరం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అలాగే మిగతా జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఆకస్మికంగా ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్స్ క్రింద నిలబడొద్దని సూచించారు. పొలాల్లో పనిచేసే రైతులు, పశుకాపరులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఆకాశం మేఘావృతమై ఉరుములు వినిపించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. వర్షపు గాలుల వల్ల ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటికి వీలైనంత దూరంగా ఉండాలన్నారు.

**ఎండ తీవ్రత, వడగాల్పులు**

నేడు శ్రీకాకుళం జిల్లాలో 10 మండలాలు, విజయనగరం 13, మన్యం 6, అల్లూరి 2, పోలవరం 8, కాకినాడ 8, పశ్చిమ గోదావరి 2, ఏలూరు 1, కృష్ణా 3, ప్రకాశం 1, అనంతపురం 1, చిత్తూరు 1 మొత్తంగా 56 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 67 మండలాల్లో వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు.

శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 42–44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. కోనసీమ, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 40–42 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యే అవకాశం ఉందన్నారు.

ఆదివారం ప్రకాశం జిల్లా కారేడులో 43.5 డిగ్రీలు, మార్కాపురం జిల్లా నందన మారెళ్లలో 43.4, బాపట్ల జిల్లా పిట్టలవాని పాలెం, కృష్ణా జిల్లా పెదపారుపూడిలో 43.2, పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 43.1, కోనసీమ జిల్లా రామచంద్రాపురం, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడులో 42.7, తూర్పు గోదావరి జిల్లా బ్రాహ్మణ గూడెం, ఏలూరు జిల్లా కుక్కునూరు, పోలవరం జిల్లా కూనవరం, గుంటూరు జిల్లా పాంద్రపాడు, నెల్లూరు జిల్లా గూడూరులో 42.6, పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో 42.5 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డు అయినట్లు పేర్కొన్నారు.

ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎండలో బయటకు వెళ్లేటప్పుడు చెవుల్లోకి వేడి గాలి వెళ్లకుండా జాగ్రత్త పడాలని, గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, మంచి నీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

# ఎరువుల పంపిణీలో పారదర్శకతకు

# ఏపీఎఐఎంఎస్ 2.0 దోహదం

- రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువుల పంపిణీ జరగాలి
- కౌలు రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలి
- కృత్రిమ కొరత, మళ్లింపులను అరికట్టేందుకు విజిలెన్స్ బృందాలు ఏర్పాటు చేయాలి
- జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, వ్యవసాయ అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు టెలికాన్ఫరెన్స్



అమరావతి, జూన్ 7 (చైతన్య రథం): రాష్ట్రంలో ఎరువుల పంపిణీని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు రూపొందించిన ఏపీఎఐఎంఎస్ 2.0 వ్యవస్థను విజయవంతంగా అమలు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ఎరువుల పంపిణీని ఏపీఎఐఎంఎస్ 2.0 యాప్ ద్వారా అమలు చేసే అంశంపై ఆదివారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జిల్లా వ్యవసాయ అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలోని 28 జిల్లాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సమీక్ష సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. కొత్త విధానం అమలుతో కౌలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. ఎరువుల పంపిణీపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి జిల్లా, క్షేత్రస్థాయిలో విజిలెన్స్ బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కృత్రిమ డిమాండ్, ఎరువుల మళ్లింపు, రైతుల్లో అనవసర ఆందోళనలను అరికట్టాలని ఆదేశించారు. వివిధ పంటలకు అవసరమైన ఎరువుల వినియోగంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. పంటల సరళి, అంచనా డిమాండ్ ఆధారంగా మండల స్థాయిలో ముందస్తుగా ఎరువుల నిల్వలు ఉంచాలని సూచించారు. గత ఏడాది ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కృష్ణ, కాకినాడ జిల్లాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద కేంద్ర ప్రభుత్వం తయారు చేసిన ఎఫ్ఎఫ్ఎస్ ద్వారా ఎరువులు బుక్ చేసుకునే అవకాశం ఉంటుందని, మిగతా 26 జిల్లాల్లో ఏపీఎఐఎంఎస్ 2.0 యాప్ ద్వారా ఎరువులు కొనుగోలు జరుగుతుందని వెల్లడించారు. ఎరువుల పంపిణీ ప్రక్రియకు ఆటంకం కలిగించేలా తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

సీఎం కార్యదర్శి రాజమౌళి మాట్లాడుతూ ఎరువుల మళ్లింపును అరికట్టేందుకు కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారులు ప్రతిరోజూ విశ్లేషణాత్మక నివేదికలు సమర్పించాలని, రైతుల సమస్యల పరిష్కారానికి రియల్‌టైమ్ గ్రీవెన్స్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాల మధ్య ఉత్తమ విధానాలను పంచుకుంటూ సమస్యల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏపీఎఐఎంఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేసి రైతులకు పారదర్శక, వేగవంతమైన ఎరువుల పంపిణీని నిర్ధారించాలని అన్ని జిల్లాల అధికారులకు సమావేశం ముగింపులో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ డైరెక్టర్ జిలానీ ఏపీఎఐఎంఎస్ 2.0 అభివృద్ధి పురోగతి, జిల్లాల సన్నద్ధతపై వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని రైతు సేవా కేంద్రాలకు (ఆర్ఎస్‌కేలు) లాగిన్ వివరాలు అందజేసినట్లు తెలిపారు. ఖరీఫ్-2025 ఈ-క్రాప్ బుకింగ్ పరిధిలో ఉన్న రైతుల జాబితాను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ఎరువుల రిటైలర్లు, పీఏసీఎస్‌లను ఏపీఎఐఎంఎస్ 2.0లో నమోదు చేసి సంబంధిత రైతు సేవా కేంద్రాలకు అనుసంధానం చేసినట్లు తెలిపారు. అన్ని వర్గాల రైతులు తమకు సమీపంలోని గుర్తింపు పొందిన రిటైలర్ల ద్వారా ఎరువులను కొనుగోలు చేసుకునే అవకాశం ఉంటుందని వెల్లడించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన సాధారణ ఎరువుల సిఫార్సుల ఆధారంగానే ఎరువుల కేటాయింపు జరుగుతుందని చెప్పారు.

# ప్రతి కాల్ వెనుక ఒక ప్రాణం...

# ప్రతి స్పందన వెనుక

CALL 108 EMERGENCY

- గోల్డెన్ అవర్‌లో గోల్డెన్ సర్వీసెస్..
- 108 అంబులెన్స్‌ల రూపురేఖలు మార్చేసిన కూటమి ప్రభుత్వం
- ఒక్క ఏడాదిలోనే 7.78 లక్షల అత్యవసర కేసులకు సత్వర స్పందన
- భవ్య హెల్త్ కేర్ ఆధ్వర్యంలో మరో మైలురాయి



అమరావతి (చైతన్య రథం): ఏపీలో కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతున్నట్టే 108 అంబులెన్స్ సర్వీసులూ లక్షలాదిమందికి ప్రాణదాతగా నిలుస్తూ సమర్థతను చాటుకుంటున్నాయి. ప్రతి నిమిషం ప్రాణ రక్షణే లక్ష్యంగా అత్యవసర సేవలు అందిస్తున్నాయి. భవ్య హెల్త్ కేర్ ఆధ్వర్యంలో అంబులెన్స్‌లకు టెక్నాలజీ జోడించి బాధితులను గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రులకు చేర్చాయి. 2025 జూన్ నుంచి 2026 మే వరకు ఏడాది కాలంలో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 7,78,799 అత్యవసర కేసులకు స్పందించి వేలాది కుటుంబాల్లో ఆశాజ్యోతిని వెలిగించాయి.

**ప్రాణాపాయ స్థితిలో దేవుడిలా 108 సాయం**

ఈ ఏడాది కాలంలో 1,13,764 మంది రోడ్డు ప్రమాద బాధితులకు 108 సిబ్బంది గోల్డెన్ అవర్‌లో అత్యవసర వైద్య సహాయం అందించారు. అలాగే 1,05,786 మంది గర్భిణీలను సురక్షితంగా ఆసుపత్రులకు తరలించి తల్లి-శిశు ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించారు. 97,118 శ్వాసకోశ సమస్యల కేసుల్లో తక్షణ వైద్య సహాయం అందించి ప్రాణాలను కాపాడారు. అదేవిధంగా 49,342 వాహనేతర గాయాల కేసులు, 45,951 గుండెజబ్బుల కేసులు, 40,553 స్పృహ తప్పిన కేసులు, 34,532 కడుపు నొప్పి కేసులు, 32,858 విషప్రయోగ కేసులు, 29,485 ఫిట్స్ కేసులు, 27,455 తీవ్ర జ్వరం కేసులు, 20,278 పక్షవాతం కేసులు, 15,441 దాడుల కేసులు, 14,088 జంతువుల కాటు కేసులు, 14,007 నవజాత శిశువుల అత్యవసర కేసులతో పాటు మరో 1,38,141 ఇతర అత్యవసర కేసుల్లోనూ 108 సిబ్బంది అంకితభావంతో సేవలందించి తమ చిత్తశుద్ధిని చాటుకున్నారు. ఈ మొత్తం సేవల్లో 2,53,022 కేసులు ఒక ఆసుపత్రి నుండి మరొక ఆసుపత్రికి తరలించిన అంతర్గత బదిలీలు కాగా, 5,25,777 కేసులు నేరుగా ప్రమాద స్థలాలు మరియు అత్యవసర ప్రాంతాల నుండి ఆసుపత్రులకు తరలించిన నాన్-ఐఎఫ్‌టీ కేసులుగా నమోదయ్యాయి.

**గుండెపోటు వంటి ఎమర్జెన్సీ కేసుల్లో ప్రాణాధారంగా 108**

ప్రాణాపాయ పరిస్థితుల్లో ప్రతి నిమిషం కీలకంగా మారే గుండెజబ్బుల అత్యవసర కేసుల్లో 108 అంబులెన్స్ సిబ్బంది దేవుడిలా మారి, సకాలంలో సర్వీస్ అందిస్తూ ఎందరికో పునర్జన్మను ప్రసాదిస్తున్నారు. ఏడాదిలో 45,951 గుండెజబ్బుల కేసులకు స్పందించి సకాలంలో వైద్య సహాయం అందించారు. దీంతో పాటు ఛాతి నొప్పి, శ్వాసకోశ ఇబ్బందులు వంటి అత్యవసర పరిస్థితుల్లో 108 సిబ్బంది వేగంగా సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించి సమీప ఆసుపత్రులకు తరలించారు. అత్యాధునిక వైద్య పరికరాలు, శిక్షణ పొందిన జుమీలు మరియు సమర్థవంతమైన అంబులెన్స్ నిర్వహణతో వేలాది ప్రాణాలను కాపడడంలో 108 సేవలు కీలక పాత్ర పోషించాయి. ఆపద సమయంలో రోగికి వైద్య సహాయం అందే వరకు జుమీలు అందించే సేవలు ప్రాణరక్షణలో కీలకంగా మారుతున్నాయి. వారి సమయస్ఫూర్తి, నైపుణ్యం, సేవాభావం వల్ల వేలాది మంది ప్రాణాలు నిలబడుతున్నాయి.

**ఎమర్జెన్సీ రోగుల పాలిట సంజీవనిగా సేవలు**

ఈ సందర్భంగా భవ్య హెల్త్ కేర్ మీడియా కోఆర్డినేటర్ మాట్లాడుతూ, ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ సరైన సమయంలో అత్యవసర వైద్య సహాయం అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఆధునిక సాంకేతికత, నిరంతర నిఘా వ్యవస్థలు మరియు నైపుణ్యం కలిగిన సిబ్బందితో 108 సేవలను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా మరింత సమర్థవంతమైన సేవలు అందించి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని పేర్కొన్నారు.

**108 సేవల పనితీరుపై సర్వత్రా హర్షం**

ప్రమాదాలు, గుండెపోటు, ప్రసవాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో సమయానికి చేరుకుని వైద్య సహాయం అందించడం ద్వారా 108 సేవలు ప్రజారోగ్యానికి భరోసా కల్పిస్తున్నాయి. అత్యవసర సమయాల్లో వేగంగా స్పందిస్తూ ప్రాణాలను కాపాడుతున్న 108 అంబులెన్స్ సేవలపై బాధితులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు 24 గంటలూ అందుబాటులో ఉండే 108 సేవలు అనేక కుటుంబాలకు ఆపద్బాంధవంగా నిలుస్తున్నాయని ప్రజలు అభినందిస్తున్నారు. అత్యవసర సమయంలో ఒక్క ఫోన్ కాల్‌తో స్పందించి బాధితులను సురక్షితంగా ఆసుపత్రులకు తరలిస్తున్న సిబ్బంది సేవాభావాన్ని కొనియాడుతున్నారు.

# నా శ్వాస, ధ్యాస పాలకొల్లు అభివృద్ధి సంక్షేమమే!

**ఒక్క రోజులో రూ.2.35 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి నిమ్మల శంకుస్థాపనలు**



పాలకొల్లు (చైతన్య రథం): అభివృద్ధి, సంక్షేమానికి సెలవు లేదని, ప్రతిరోజు, ప్రతి గంట, ప్రతి నిమిషం తన ధ్యాస శ్వాస పాలకొల్లు నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం కోసమేనని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లు నియోజకవర్గ స్థాయిలో పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండలాల్లోని పలు గ్రామాల్లో రూ. 2.35 కోట్లతో జరగనున్న సీసీ రోడ్లు, డ్రైన్ల అభివృద్ధి పనులకు భగ్గేశ్వరం గ్రామంలో కూటమి నాయకులతో కలిసి మంత్రి నిమ్మల రామానాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. మహిళలు పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కనిపించే వ్యక్తులు కాదని, కొందరు తెలిసో తెలియకో ఎన్నికల సమయంలో వచ్చి ఆ తర్వాత మళ్లీ కనిపించరన్నారు. సంవత్సరంలో 365 రోజులు ఐదేళ్లపాటు కనిపించే వ్యక్తినని అన్నారు. ఈ 20 నెలల్లో గ్రామానికి పదిహేను-ఇరవై సార్లు వచ్చానని, ఎన్నికలకు మరో మూడేళ్లు సమయం ఉందన్నారు. 2024 జూన్ ఎన్నికల కౌంటింగ్‌లో గెలిచిన తర్వాత రోజు నుంచే వారి రుణం తీర్చుకునేలా పనిచేస్తున్నానని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ పాలకొల్లు నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద ఎత్తున కోట్లాది రూపాయలు నిధులు తీసుకువస్తున్నానన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మోదీల కలయికతో అభివృద్ధి సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేరుస్తున్నారన్నారు. చేనేత కార్మికులను ఆదుకునేలా మగ్గానికి 200 యూనిట్లు, మరమగ్గానికి 500 యూనిట్ల విద్యుత్తును ఉచితంగా ఇచ్చి ఆదుకుంటున్నామన్నారు.

రాష్ట్రంలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ మంచి ప్రభుత్వాన్ని ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. గత ఐదేళ్లు వైసీపీ పాలన విధ్వంసం, అరాచకం, కక్షలు, వేధింపులతో సాగగా నేడు వికాసం వైపు పాలన నడుస్తుందన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా చిన్నాభిన్నం చేసి అప్పులపాలు చేసిన జగన్ అధికార దాహంతో మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్నాడని, పొరపాటున వస్తే రాష్ట్రంతో పాటు భావితరాల భవిష్యత్తు కూడా నాశనం అవుతుందన్నారు. జగన్‌కు ఓటు వేయడం అంటే భస్మాసుర హస్తాన్ని నెత్తిమీద పెట్టుకున్నట్లేనన్నారు. గొడ్డలి పార్టీని పూర్తిగా భూస్థాపితం చేయాలని పిలుపునిచ్చారు.

## డీఎస్సీ గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు

డీఎస్సీ గురించి మాట్లాడే నైతిక అర్హత జగన్‌కు లేదని అన్నారు. ఐదేళ్ల పాటు డీఎస్సీ గురించి ఒక్క మాట కూడా మాట్లాడని వారు, ఇప్పుడు 16,300 ఉపాధ్యాయ నియామకాలపై విమర్శలు చేయడం తగదని మంత్రి పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం డీఎస్సీ నిర్వహిస్తామని, ఐదేళ్లలో రెండు-మూడు మెగా డీఎస్సీలు నిర్వహిస్తామని ఇచ్చిన హామీలను జగన్ నిలబెట్టుకోలేదని విమర్శించారు.

ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి ఐదేళ్లలో ఒక్కటిని కూడా విడుదల చేయలేదని, ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయలేకపోయిన జగన్ రాష్ట్ర ప్రజలకు, నిరుద్యోగ యువతకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు డీఎస్సీపై తొలి సంతకం చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. ఏడాది లోపే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశారని చెప్పారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రాష్ట్రంలో 2 లక్షల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ఘనత ఉందని గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం డీఎస్సీ ద్వారా 16 వేల మంది ఉపాధ్యాయులకు ఉద్యోగాలు కల్పించి వారి జీవితాల్లో వెలుగు నింపిందని అన్నారు.

కష్టపడి చదివి ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల మనోభావాలను తప్పుడు ప్రచారంతో దెబ్బతీయొద్దని మంత్రి నిమ్మల రామానాయుడు సూచించారు. డీఎస్సీకి సంబంధించి పాలకొల్లులో ధర్మారావు ఫౌండేషన్ ద్వారా ఐదు నెలలపాటు కోచింగ్ ఇస్తే 700 మంది వరకు నిరుద్యోగ యువతీ యువకులు శిక్షణ పొంది 50 మంది వరకు ఉద్యోగాలు సాధించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పాలకొల్లు తహసీల్దార్ ఎడ్ల దుర్గా కిషోర్, కూటమి నాయకులు ఉన్నమట్ల కబర్ధి, పాముల రజిని కుమార్, కలిదిండి రామచంద్ర రాజు, దొంగ బాబాయ్, పెనుమత్స శ్రీనివాస రాజు, అందే కోటి వీరభద్రరావు, కుక్కల విజయ కుమార్, ఎల్లపు లోకేష్, కాసకోటి వీరభద్రరావు, వీరమళ్లు శ్రీనివాస రావు, నిల్లవీరభద్రరావు, అందే లింగయ్య, పెచ్చెట్టి నాని, తొంట సుబ్బారావు తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఉమీద్ పోర్టల్ నమోదులో ఏపీ వక్ఫ్ బోర్డు సక్సెస్

**8,681 వక్ఫ్ సంస్థలు,**

**82,567 ఎకరాల వక్ఫ్ ఆస్తుల డిజిటలైజేషన్ పూర్తి**



అమరావతి (చైతన్య రథం): ఉమీద్ సెంట్రల్ పోర్టల్ అదనపు 6 నెలల గడువు జూన్ 6తో ముగిసిందని, పోర్టల్‌లో వక్ఫ్ ఆస్తుల నమోదులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఘన విజయాన్ని సాధించిందని చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. గడువు ముగిసింది పాత వక్ఫ్ ఆస్తుల నమోదుకేనని, నూతన రిజిస్ట్రేషన్లకు పోర్టల్ అందుబాటులోనే ఉంటుందని తెలిపారు.

భారత ప్రభుత్వం నిర్దేశించిన మేరకు రాష్ట్రంలోని 4,711 వక్ఫ్ సంస్థల నమోదుతో ప్రారంభమైన ఈ ప్రక్రియలో సాంకేతిక సమస్యలు, సర్వర్ అంతరాయాలు, రికార్డుల కొరత, అంతర్రాష్ట్ర ఆస్తుల వివరాల సేకరణ వంటి అనేక సవాళ్లు ఎదురైనప్పటికీ, ప్రత్యేక కార్యాచరణ, నిరంతర పర్యవేక్షణ, సమన్వయంతో విజయవంతంగా పూర్తి చేయగలిగామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని మొదటి సర్వే వక్ఫ్ ఆస్తుల వివరాలను 100 శాతం నమోదు పూర్తి చేయడంతో పాటు, రెండవ సర్వేలో గుర్తించి ప్రభుత్వం నుంచి అందిన ఆస్తుల వివరాలను కూడా 100 శాతం ఉమీద్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశామని తెలిపారు.

విస్తృత స్థాయిలో నిర్వహించిన క్షేత్రస్థాయి పరిశీలనలు, ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు, సమీక్ష సమావేశాల ఫలితంగా మొదట నిర్దేశించుకున్న లక్ష్యాన్ని అధిగమించి మొత్తం 8,681 వక్ఫ్ సంస్థలు మరియు 82,567.06 ఎకరాల వక్ఫ్ ఆస్తులను ఉమీద్ పోర్టల్‌లో నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ అందించిన సహకారం, ప్రోత్సాహం, మార్గదర్శకత్వానికి చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ కృతజ్ఞతలు తెలిపారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత వల్లే ఈ ఘన విజయం సాధ్యమైందన్నారు. వక్ఫ్ ఆస్తులపై సమగ్ర డిజిటల్ డేటాబేస్ ఏర్పడటం ద్వారా ఆక్రమణల నివారణ, ఆస్తుల రక్షణ, ఆదాయ వృద్ధి, పారదర్శక పరిపాలనకు బలమైన పునాది ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన అధికారులు, సిబ్బంది, జిల్లా ఇన్స్పెక్టర్ ఆడిటర్లు, ముతవల్లీలు, నిర్వహణ కమిటీలు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

### ఆరోగ్యకరమైన జీవనశైలికి

# యోగా ఉత్తమ మార్గం: మంత్రి సవిత

- **యోగాతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యం**
- **ప్రతి ఒక్కరూ యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి**
- **లేపాక్షిలో నిర్వహించిన యోగా వేడుకలకు మంత్రి హాజరు**



లేపాక్షి/శ్రీసత్యసాయి (చైతన్య రథం): ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగా ఉత్తమ మార్గమని, యోగాతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమని మంత్రి సవితమ్మ తెలిపారు. ఆదివారం ఉదయం లేపాక్షి మండలంలోని వీరభద్రేశ్వర స్వామి దేవాలయ సన్నిధిలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కలిసి అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ చారిత్రాత్మక లేపాక్షి క్షేత్రంలో కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషకరమని, గ్రామీణస్థాయి నుండి పట్టణ స్థాయి వరకు మహిళలు, యువత, వృద్ధులు అందరూ యోగా శిబిరాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరమని పేర్కొన్నారు. యోగా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని అన్నారు. నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడవచ్చని తెలిపారు.

యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, శరీరం, మనస్సు, ఆత్మల సమన్వయానికి మార్గమని అన్నారు. ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళనలు మరియు అనారోగ్య సమస్యలను అధిగమించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రతిరోజూ కొంత సమయం యోగా సాధనకు కేటాయించడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత మరియు సానుకూల ఆలోచనా విధానం పెంపొందుతాయని తెలిపారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

భారతదేశపు ప్రాచీన ఔన్నత్యానికి ప్రతీకగా నిలిచిన యోగా నేడు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందడం ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయమని మంత్రి పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా శక్తివంతమైన సాధనమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడానికి యోగాను ఆచరించాలని సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి "ఒక భూమి -ఒక ఆరోగ్యం కోసం యోగా" అనే లక్ష్య సాధనకు అందరూ భాగస్వాములు కావాలని మంత్రి సవిత కోరారు.

# టీడీపీలోకి భారీగా చేరికలు

- **మంత్రి సంధ్యారాణి సమక్షంలో 300 గిరిజన కుటుంబాలు చేరిక**
- **అభివృద్ధి చూసి గిరిజన ప్రాంతాల్లో పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణ**



పాచిపెంట (చైతన్య రథం): పాచిపెంట మండలం కేసలి గిరిజన పంచాయతీ పరిధిలోని కుమ్మరివలస, మడవలస, ఊబగుడ్డి, షేర్‌గుడ్డి, కేసలి గ్రామాల నుండి సుమారు 300 గిరిజన కుటుంబాలు పార్టీ అధ్యక్షులు గూడెపు యుగంధర్ ఆధ్వర్యంలో మంత్రి సంధ్యారాణి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి చూసి గిరిజనులు పార్టీలో చేరుతున్నారని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని తెలిపారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో టీడీపీకి ప్రజాదరణ రోజురోజుకూ పెరుగుతోందని మంత్రి అన్నారు.

# నవ్యాంధ్రలో క్రికెట్ విప్లవం

- మూడు నగరాలు... ఏడు జట్లు... ఒకే లక్ష్యం
- యువత కలల వేదిక ఏపీఎల్-2026
- ఏపీఎల్-2026 ప్రత్యేకతలను వివరించిన ఎంపీ శివనాథ్

విజయవాడ (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ క్రికెట్ చరిత్రలో మరో సువర్ణ అధ్యాయానికి తెరలేపుతూ, రాష్ట్రవ్యాప్తంగా క్రికెట్ సంబరాలకు వేదికగా నిలిచే ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)-2026కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 9నుంచి 30వరకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న టోర్నీ ద్వారా క్రికెట్‌ను రాష్ట్రంలోని నలుమూలలకు విస్తరింపజేయాలనే లక్ష్యంతో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ముందుకు సాగుతోంది. విజయవాడలోని ఏసీఏ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని) ఏపీఎల్-2026 విశేషాలను వెల్లడించారు. రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి ఇది ఒక కొత్త దిశగా నిలవబోతోందని, యువతకు మరిన్ని అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

### మూడు నగరాల్లో క్రికెట్ పండుగ

ఈసారి ఏపీఎల్‌ను ఒకే ప్రాంతానికి పరిమితం చేయకుండా విశాఖపట్నం, కడప, మంగళగిరి నగరాల్లో నిర్వహించడం ద్వారా క్రికెట్ వికేంద్రీకరణకు శ్రీకారం చుట్టామని చిన్ని తెలిపారు. మొత్తం ఏడు జట్లు పాల్గొనే ఈ టోర్నీలో జూన్ 9 నుంచి 14 వరకు విశాఖపట్నంలో, జూన్ 17 నుంచి 21 వరకు కడపలో, జూన్ 24 నుంచి 30 వరకు మంగళగిరిలో మ్యాచ్‌లు జరుగుతాయని చెప్పారు. సెమీఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లు మంగళగిరిలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గత ఏడాది ఫైనల్ పోటీలకు వేలాదిమంది ప్రేక్షకులు హాజరై ఏపీఎల్‌కు విశేష ఆదరణ లభించిందని గుర్తుచేస్తూ, ఈసారి మరింత వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

### యువత కలలకు వేదికగా ఏపీఎల్

రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి వెలుగులోకి వస్తున్న యువ క్రికెటర్లకు ఏపీఎల్ ఒక గొప్ప అవకాశ వేదికగా నిలుస్తోందని చిన్ని పేర్కొన్నారు. ఈ టోర్నీలో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆటగాళ్లకే ప్రాధాన్యం ఇస్తున్నామని, స్థానిక ప్రతిభను జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమని చెప్పారు. ఇటీవల గుంటూరుకు చెందిన యువ క్రికెటర్ రషీద్‌కు ఇండియా-ఎ జట్టులో అవకాశం రావడం రాష్ట్ర క్రికెట్ అభివృద్ధికి నిదర్శనమని పేర్కొంటూ, భవిష్యత్తులో మరెందరో ఆటగాళ్లు ఏపీఎల్ ద్వారా జాతీయ స్థాయికి ఎదుగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.




### విద్యార్థులకు ఉచిత ప్రవేశం

యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఉచిత పాసులు అందించనున్నట్లు చిన్ని వెల్లడించారు. విద్యాసంస్థలకు ముందుగానే మ్యాచ్‌ల షెడ్యూల్ అందించి, విద్యార్థులు ప్రత్యక్షంగా మ్యాచ్‌లు వీక్షించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### అంతర్జాతీయ స్థాయి వాతావరణం

విశాఖపట్నం, కడప, మంగళగిరి వేదికల్లో అత్యాధునిక సదుపాయాలతో మ్యాచ్‌లను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులో జరిగే పోటీలు ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతిని అందిస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో మంగళగిరిని రాష్ట్ర క్రికెట్‌కు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు.

### క్రీడలతో పాటు ఆంధ్ర సాంస్కృతిక వైభవం

ఏపీఎల్‌ను కేవలం క్రికెట్ టోర్నీగా కాకుండా ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటే ఉత్సవంగా తీర్చిదిద్దుతున్నామని చిన్ని తెలిపారు. తోలుబొమ్మలాట, కోలాటం వంటి జానపద కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, సినీ మరియు సంగీత రంగ ప్రముఖుల ప్రత్యేక కార్యక్రమాలతో ప్రేక్షకులను అలరించేలా ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు.

### జియో స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

రాష్ట్రవ్యాప్తంగా మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు క్రికెట్ అభిమానులు ఏపీఎల్ మ్యాచ్‌లను వీక్షించేలా జియో స్టార్ స్పోర్ట్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. విశాఖపట్నంలో ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక ఫ్లాష్‌మాబ్ కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

### నవ్యాంధ్ర క్రీడా ప్రగతికి నాంది

పరిమిత వనరులతో ప్రారంభమైన ఏపీఎల్ నేడు రాష్ట్ర క్రీడా ప్రతిభను వెలికితీసే గొప్ప వేదికగా ఎదిగిందని చిన్ని పేర్కొన్నారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా అత్యుత్తమ ప్రమాణాలతో పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. మీడియా, క్రీడాభిమానులు, ప్రజలు కలిసి వర్ధమాన క్రీడాకారులను ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు.

"ఏపీఎల్-2026 కేవలం ఒక క్రికెట్ టోర్నీ కాదు -యువత కలలకు వేదిక. రాష్ట్ర ప్రతిభకు గుర్తింపు. నవ్యాంధ్ర క్రీడా భవిష్యత్తుకు బలమైన పునాది" అని శివనాథ్ వ్యాఖ్యానించారు. మూడు నగరాలు... ఏడు జట్లు... వేలాది అభిమానులు... రాష్ట్రవ్యాప్తంగా వెలుగులోకి వస్తున్న యువ ప్రతిభతో నిర్వహిస్తున్న ఏపీఎల్-2026, ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రముఖ క్రికెట్ గమ్యస్థానంగా తీర్చిదిద్దే దిశగా మరో చారిత్రాత్మక అడుగుగా నిలవనుందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# యోగాంధ్ర.. రిజిస్ట్రేషన్ల జోరు!

- కోటిమందిని భాగస్వాములను చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం
- తొలి రోజు 25 వేలమంది పేర్లు నమోదు
- రాష్ట్రవ్యాప్తంగా యోగా సందడే సందడి
- మాస్టర్ ట్రైనర్ల ద్వారా 50,752 మందికి శిక్షణ కార్యక్రమాలు
- భారతీయ సంస్కృతికి 'యోగా' ప్రతీక: లేపాక్షిలో మంత్రి సత్యకుమార్



లేపాక్షి (చైతన్య రథం): కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర-2026 ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నుంచి ఉత్సాహ వాతావరణంలో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21న జరిగే భారీ యోగా కార్యక్రమాలకు సన్నాహకంగా ఈ నెల 20వ తేదీ వరకు 28 జిల్లాల్లో యోగాపై అవగాహన, ప్రచార కార్యక్రమాలను వినూత్న పద్ధతుల్లో చేపట్టడం ఆదివారం నుంచి ప్రారంభమైంది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నేతృత్వంలో శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షిలోని ఆలయ ప్రాంగణంలో యోగాసనాల రాష్ట్ర స్థాయి ప్రారంభ కార్యక్రమం ఆహ్లాద వాతావరణంలో జరిగింది.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యోగా భారతీయ సంస్కృతికి, జీవన విధానానికి ప్రతీక అని, యోగాసనాల ద్వారా అనారోగ్యాలు, మానసిక సమస్యలకు దూరంగా ఉండవచ్చని, శాస్త్రీయంగా ఇది నిరూపితమైందని తెలిపారు. అందువల్లే కోటి మందిని యోగాసనాల కార్యక్రమాల భాగస్వాములు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, తొలి రోజు 25,000 మంది పేర్లు నమోదు చేసుకున్నారని, అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

లేపాక్షి కార్యక్రమానికి కొనసాగింపుగా ఎంపిక చేసిన 5 జిల్లాల్లోనూ యోగాసనాల కార్యక్రమాలు కొనసాగాయి. అన్ని వయసుల వారు ఈ కార్యక్రమాల్లో ఆనందోత్సాహాల మధ్య పాల్గొంటున్నారు. కోటి మందిని యోగాసనాల కార్యక్రమాల్లో భాగస్వాములు చేయాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. యోగాంధ్ర పోర్టల్ ద్వారా తొలి రోజు 25,000 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. పేర్ల నమోదు రానున్న రోజుల్లో మరింత ఊపందుకోనుంది. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి. వీరపాండియన్ ఒక ప్రకటన జారీ చేశారు.

### 5,992 మందికి శిక్షణ పూర్తి!

రాష్ట్రవ్యాప్తంగా శనివారం నుంచి ఆదివారం వరకు యోగా మాస్టర్ ట్రైనర్లు 5,922 మంది పేర్లు నమోదు చేసుకుని పూర్తిస్థాయిలో శిక్షణ పొందారు. వీరిలోని సీనియర్ మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలోనే ఆదివారం నుంచి కొత్త వారికి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 2.5 లక్షల మందికి ఈ శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వీరిలో ఆదివారం 50,752 మంది యోగా మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ పొందారు. ఈ కేటగిరీలోని వారికి 5 రోజులపాటు శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయి.

### జిల్లాల్లో జరిగిన కార్యక్రమాలు

శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షి ఆలయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా జరిగిన రాష్ట్ర స్థాయి ప్రారంభ కార్యక్రమంలో 1,952 మంది, కడప జిల్లా ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయ ప్రాంగణంలో 625 మంది, కృష్ణా జిల్లా మంగినపూడి బీచ్‌లో 758 మంది, తిరుపతిలోని ఎస్వీ జూ పార్కు ఆవరణలో 2,150 మంది చొప్పున పాల్గొన్న యోగాసనాల కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి.

### విజయవాడ, అమలాపురంలో థీమ్ బేస్డ్ యోగాసన కార్యక్రమాలు

ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో జరిగిన ఇతివృత్త ఆధారిత యోగా (థీమ్ బేస్డ్) కార్యక్రమంలో 1,000 మంది పోలీసులు పాల్గొన్నారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి. వీరపాండియన్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. అమలాపురంలో జరిగిన కార్యక్రమానికి 845 మంది రైతులు హాజరయ్యారు.

### మొదలైన పోటీలు

రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం 253 గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా యోగాసనాల ప్రాధాన్యంపై నిర్వహించిన పోటీల్లో 1,700 మంది పాల్గొన్నారు. యోగాపై రకరకాల ఇతివృత్తాలతో 13 రోజులు పాటు ఈ పోటీలు జరుగుతాయి.

### వైద్య కళాశాలల్లోనూ యోగాంధ్ర

డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధర్ బాబు జిల్లా అధికారులకు పంపిన ఆదేశాల్లో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా యోగాసన కార్యక్రమాలను జరపాలని వెల్లడించారు. ఈ నెల 20వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అలాగే ప్రతి ప్రభుత్వ వైద్య కళాశాలలో యోగాంధ్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణువర్ధన్ ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లకు ఆదేశాలు పంపారు. ఈ నెల 20వ తేదీ వరకు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా వైద్య విద్యార్థులను యోగాసన కార్యక్రమాల్లో మమేకం చేయాలని పేర్కొన్నారు. ప్రతి కళాశాలలో ఒక కో-ఆర్డినేటర్ ద్వారా ఈ కార్యక్రమాల పర్యవేక్షణ జరగాలని, నిర్వహణ వివరాలతో ఈ నెల 22వ తేదీలోగా నివేదించాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.

# ఓటర్ల సమగ్ర జాబితా కోసం కృషి చేయండి

## పార్టీ శ్రేణులకు శాసనసభ్యుడు పీజీవీఆర్ నాయుడు (గణబాబు) పిలుపు

విశాఖపట్టణం (చైతన్యరథం): ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ' స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ఎస్ఐఆర్‌పై విశాఖ పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి విస్తృత శిక్షణా తరగతుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యుడు పీజీవీఆర్ నాయుడు (గణబాబు) అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణా తరగతుల్లో టిడిపి నియోజకవర్గ పరిధిలోని బూత్ లెవల్ ఏజెంట్లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, వార్డు అధ్యక్షుడు కార్యదర్శులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గణబాబు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యానికి ఓటర్ల జాబితాయే పునాది అని, ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ద్వారా దొంగ ఓట్ల తొలగింపు, అర్హులైన కొత్త ఓటర్ల నమోదు, వలస వెళ్లిన వారి వివరాల సవరణ వంటి అంశాలపై తెలుగుదేశం పార్టీ బూత్ స్థాయి సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో భాగంగా రాబోయే రోజుల్లో బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి సేకరిస్తారని, ఈ సమయంలో టిడిపి శ్రేణులు ప్రజలకు అండగా ఉండి పూర్తి అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఇంటింటి సర్వేపై టిడిపి నిఘా, తెలుగుదేశం పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు తమ పరిధిలోని ప్రతి ఇంటినీ దీూాలు సందర్శించేలా చూడాలన్నారు. ఎన్యుమరేషన్ ఫారాలలో ప్రతి ఓటరు వివరాలు పక్కాగా నమోదవుతున్నాయో లేదో పరిశీలించాలని ఎమ్మెల్యే సూచించారు. అర్హులైన జూలై 1, 2026 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ కొత్త ఓటర్లుగా నమోదు చేయించాలి. వలస వెళ్లిన లేదా మరణించిన వారి పేర్లను నిబంధనల ప్రకారం జాబితా నుండి తొలగించేలా టీడీపీ వార్డు ప్రతినిధులు చొరవ తీసుకోవాలన్నారు. ఆధార్, ఇతర గుర్తింపు పత్రాల వివరాలను నమోదు చేసేటప్పుడు ఎటువంటి తప్పులు దొర్లకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. లి సమన్వయం మరియు గడువు: జూలై 21న విడుదలయ్యే డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ ముసాయిదా జాబితా, సెప్టెంబర్ 22న వచ్చే ఫైనల్ లిస్ట్ ప్రక్రియ ముగిసేవరకు టీడీపీ వార్డు ప్రెసిడెంట్లు, సెక్రటరీలు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి. నియోజకవర్గంలో ప్రతి ఒక్క ఓటరు హక్కును కాపాడటం, పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగస్వామ్యం కావడం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలుగా మన బాధ్యత అని, ఈ ఎస్.ఐ.ఆర్ శిక్షణను పూర్తిగా ఉపయోగించుకోవాలని గణబాబు దిశానిర్దేశం చేశారు.





# టీడీపీలోకి 300 గిరిజన కుటుంబాలు

## సీఎం చంద్రబాబుపై నమ్మకంయస్త్రతో మంత్రి సంధ్యారాణి సమక్షంలో భారీగా చేరికలు

సాలూరు (చైతన్యరథం): పాచిపెంట మండలం కేసలి గిరిజన పంచాయతీ పరిధిలోని కుమ్మరివలస, మడవలస, ఊబగుడ్డి, షేర్‌గుడ్డి, కేసలి గ్రామాల నుండి సుమారు 300 గిరిజన కుటుంబాల వారు పార్టీ అధ్యక్షులు గూడెపు యుగంధర్ ఆధ్వర్యంలో మంత్రి సంధ్యారాణి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి చూసి గిరిజనులు పార్టీలో చేరుతున్నారని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని తెలిపారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో టీడీపీకి ప్రజాదరణ రోజురోజుకూ పెరుగుతోందని మంత్రి అన్నారు.




# దురాలోచనతోనే డీఎస్సీపై జగన్ విషప్రచారం : ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, ప్రజలకు చేస్తున్న మంచిని ఓర్వలేకే జగన్, ముగిసిపోయిన అంశాలపైనా కుట్ర రాజకీయాలు చేస్తున్నాడని, డీఎస్సీ జరగకూడదన్న దురుద్దేశంతో 250 వరకు తప్పుడు కేసులు కోర్టులో వేయించిన జగన్, నేడు డీఎస్సీపై సీబీఐ విచారణ కోరడం సిగ్గుచేటని శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించారు. ప్రజల నుంచి స్వీకరించిన వినతుల్ని వెంటనే పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. అనంతరం ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు. దగా డీఎస్సీ, ఉత్తుత్తి జాబ్ క్యాలెండర్ తో నిరుద్యోగుల్ని మోసగించిన జగన్...నేడు యువతను రెచ్చగొట్టడానికే డీఎస్సీని తప్పుపడుతున్నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేసిన మెగాడీఎస్సీ నిర్వహణలో లోకేశ్ కృషి, సమర్థత ఎంతో ఉందన్న ప్రత్తిపాటి, జగన్ వేయించిన తప్పుడు కేసుల్ని పరిష్కరించి, 16,347 పోస్టుల్ని భర్తీ చేసి, చరిత్ర సృష్టించారన్నారు. ఎన్నడూ లేనివిధంగా ప్రజల సమక్షంలో ఉద్యోగార్థులకు నియామక పత్రాలు అందించారన్నారు. తాను అమలు కాకుండా చేద్దామనుకున్న డీఎస్సీని లోకేశ్ సాకారం చేశాడన్న అక్కసు, అసూయతోనే జగన్ ఇప్పుడు విషప్రచారం చేస్తున్నాడన్నారు. ఐదేళ్లు యువతను మోసగించి, దగా డీఎస్సీ, ఉత్తుత్తి జాబ్ క్యాలెండర్ తో వంచించిన జగన్, లోకేశ్ సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీని తప్పుపట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమిప్రభుత్వానికి పేరు రాకూడదనే జగన్ డీఎస్సీని అడ్డుకున్నాడన్నారు. దొంగలు పడ్డ ఆర్నెల్ల సామెత తీరుగా వైసీపీ తీరుందని, ఎప్పుడో పూర్తైన డీఎస్సీపై ఇప్పుడు కోర్టులను ఆశ్రయించడం. గవర్నర్ కు ఫిర్యాదుచేయడం ఏంటని ప్రత్తిపాటి ప్రశ్నించారు. పుష్కరకాలం దాటిన తన అవినీతికేసుల విచారణ, పురోగతిపై సీబీఐతో మాట్లాడే ధైర్యం లేని జగన్.. డీఎస్సీపై సీబీఐ విచారణ కోరడం విడ్డూరంగా ఉందని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. తనపై ఉన్న కేసుల నుంచి బయటపడి ప్రజల ముందుకొచ్చి జగన్ ఏమైనా మాట్లాడినా అర్థం ఉంటుందన్నారు. సీబీఐ తేల్చిన రూ.47 వేల కోట్ల అక్రమార్జన సొమ్ములో రూపాయి ప్రజలకు పంచని జగన్.. అవినీతి కళ్లతో కూటమి ప్రభుత్వ పాలనను నిందిస్తున్నాడన్నారు. రాజధాని రైతుల్ని రెచ్చగొట్టేందుకు కమిటీలు.. డీఎస్సీపై కమిటీలు కేవలం జగన్ విధ్వంస రాజకీయాల్లో భాగమేనని ప్రత్తిపాటి తేల్చిచెప్పారు. అమరావతి పూర్తవడాన్ని జగన్ కలలో కూడా సహించలేడన్నారు. జగన్ తన పద్ధతి. ఆలోచనా విధానం మార్చుకోకుంటే గత ఎన్నికల్లో పడిన 39 శాతం ఓట్లు కూడా ఈసారి పడవని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. జగన్ విషప్రచారాన్ని ప్రజలు నమ్మడానికి సిద్ధంగా లేరన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో జరిగిన అద్భుతమైన అభివృద్ధి, ప్రజలకు అందుతోన్న సంక్షేమం, ఇతర విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే భారీ బహిరంగసభలు నిర్వహిస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు. అమరావతి, తిరుపతి, విశాఖపట్నంలో 9, 12, 17న జరిగే భారీ బహిరంగ సభలకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, కొత్త కోటేశ్వరరావు, ముల్లా కరిముల్లా, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల భవిష్యత్తుకు అండగా అనుమోలు : ఎమ్మెల్యే బోడే

పెనమలూరు (చైతన్యరథం): సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థుల విద్యాభివృద్ధికి చేయూతనందించడం అత్యంత గొప్ప సేవ అని,విద్య ద్వారా జీవితాలను తీర్చిదిద్దే అవకాశం కల్పించడం కన్నా విలువైన దానం మరొకటి లేదని పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బోడే ప్రసాద్ పేర్కొన్నారు...గత తొమ్మిది సంవత్సరాలుగా నిరంతరంగా నిర్వహిస్తున్న ఈ విద్యా సహాయ కార్యక్రమం సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని ఆయన అన్నారు,అనుమోలు వంశవృక్షం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్థికంగా స్థిరపడిన కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 25 మంది పేద విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసం కోసం సుమారు రూ.7 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించడం అభినందనీయమని కొనియాడారు...మన విజయాల వెనుక సమాజం పాత్ర కూడా ఉంటుందని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, అందుకే మనకు చేతనైనంత మేరకు అవసరంలో ఉన్నవారికి సహాయం చేయాల్సిన బాధ్యత ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు,ఈ ఆర్థిక సహాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించి తమ లక్ష్యాలను సాధించాలని,భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకుని మరెందరికో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. నేడు సహాయం పొందుతున్న విద్యార్థులు రేపు సమాజానికి సేవ చేసే స్థాయికి ఎదగాలని, తాము ఎదిగిన తర్వాత మరో పదిమందికి అండగా నిలిచే సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు,సమాజంలో సానుకూల మార్పు రావాలంటే ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతను గుర్తించి సేవాభావంతో ముందుకు రావాలని,పరస్పర సహకారం ద్వారానే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు...ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం సహాయం చేస్తున్న అనుమోలు కుటుంబ సభ్యుల సేవా తత్వం ప్రశంసనీయమని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పేర్కొన్నారు,ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందుతున్న విద్యార్థులందరూ విద్యలో రాణించి తమ కుటుంబాలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు...ఈ విద్యా సహాయ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన అనుమోలు వంశవృక్షం సభ్యులను, దాతలను, నిర్వాహకులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.



# అభివృద్ధి నా శ్వాస... సంక్షేమం నా ధ్యాస!

## రాష్ట్ర నీటి వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడువెల్లడి ఒక్క రోజునే రూ 2.35 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు





పాలకొల్లు (చైతన్యరథం): అభివృద్ధి, సంక్షేమానికి సెలవు లేదని... ప్రతిరోజు, ప్రతి గంట, ప్రతి నిమిషం నా ధ్యాస శ్వాస పాలకొల్లు నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం కోసమేనని రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లు నియోజకవర్గ స్థాయిలో పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండలాల్లోని పలు గ్రామాల్లో రూ 2.35 కోట్లతో జరగనున్న సీసీ రోడ్లు, డ్రైన్ల అభివృద్ధి పనులకు భగ్గేశ్వరం గ్రామంలో కూటమి నాయకులతో కలిసి మంత్రి నిమ్మల రామానాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. మహిళలు పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కనిపించే వ్యక్తులం కాదని, కొందరు తెలిసో తెలియకో ఎన్నికల సమయంలో వచ్చి ఆ తర్వాత మళ్లీ కనిపించారన్నారు. సంవత్సరంలో 365 రోజులు ఐదేళ్లపాటు కనిపించే వ్యక్తిని అన్నారు. ఈ 20 నెలల్లో గ్రామానికి పదిహేను ఇరవై సార్లు వచ్చానని, ఎన్నికలకు మరో మూడేళ్లు సమయం ఉందన్నారు. 2024 జూన్ ఎన్నికల కౌంటింగ్ లో గెలిచిన తర్వాత రోజు నుంచే మీ రుణం తీర్చుకునేలా పనిచేస్తున్నానని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ పాలకొల్లు నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద ఎత్తున కొట్లాది రూపాయలు నిధులు తీసుకువస్తున్నానన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మోదీల కలయికతో అభివృద్ధి సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చమన్నారు. చేనేత కార్మికులను ఆదుకునేలా మగ్గం కు 200సి, మరమగాలకు 500 యూనిట్ల విద్యుత్తును ఉచితంగా ఇచ్చి ఆదుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ మంచి ప్రభుత్వాన్ని ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. గత ఐదేళ్లు వైసీపీ పాలన విధ్వంసం, అరాచకం, కక్షలు, వేధింపులతో సాగగా నేడు వికాసం వైపు పాలన నడుస్తుందన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా చిన్నాభిన్నం చేసి అప్పులపాలు చేసిన జగన్ అధికార దాహంతో మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్నాడని పొరపాటున వస్తే రాష్ట్రం తో పాటు భావితరాల భవిష్యత్తు కూడా నాశనం అవుతుందన్నారు. జగన్కు ఓటు వేయడం అంటే భస్మాసుర హస్తమును నెత్తిమీద పెట్టుకున్నట్లేనన్నారు. గొడ్డలి పార్టీని పూర్తిగా భూస్థాపితం చేయాలని పిలుపునిచ్చారు. డీఎస్సీ గురించి మాట్లాడే అర్హత జగన్ కు లేదు. డీఎస్సీ గురించి మాట్లాడే నైతిక అర్హత జగన్‌కు లేదని అన్నారు. ఐదేళ్ల పాటు డీఎస్సీ గురించి ఒక్క మాట కూడా మాట్లాడని వారు, ఇప్పుడు 16,300 ఉపాధ్యాయ నియామకాలపై విమర్శలు చేయడం తగదని మంత్రి పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం డీఎస్సీ నిర్వహిస్తామని, ఐదేళ్లలో రెండు మూడు మెగా డీఎస్సీలు నిర్వహిస్తామని ఇచ్చిన హామీలను జగన్ నిలబెట్టుకోలేదని విమర్శించారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి ఐదేళ్లలో ఒక్కటిని కూడా విడుదల చేయలేదని, ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయలేకపోయిన జగన్ రాష్ట్ర ప్రజలకు, నిరుద్యోగ యువతకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు డీఎస్సీపై తొలి సంతకం చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. ఏడాది లోపే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశారని చెప్పారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రాష్ట్రంలో 2 లక్షల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ఘనత ఉందని గుర్తుచేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం డీఎస్సీ ద్వారా 16 వేల మంది ఉపాధ్యాయులకు ఉద్యోగాలు కల్పించి వారి జీవితాల్లో వెలుగు నింపిందని అన్నారు. కష్టపడి చదివి ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల మనోభావాలను తప్పుడు ప్రచారంతో దెబ్బతీయొద్దని మంత్రి నిమ్మల రామానాయుడు సూచించారు. డీఎస్సీ కి సంబంధించి పాలకొల్లులో ధర్మారావు ఫౌండేషన్ ద్వారా ఐదు నెలలపాటు కోచింగ్ ఇస్తే 700 మంది వరకు నిరుద్యోగ యువతీ యువకులు శిక్షణ పొంది 50 మంది వరకు ఉద్యోగాలు సాధించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు తాసిల్దార్ ఎడ్ల దుర్గా కిషోర్, కూటమి నాయకులు ఉన్నమట్ల కబర్ధి, పాముల రజిని కుమార్, కలిదిండి రామచంద్ర రాజు, దొంగ బాబాయ్, పెనుమత్స శ్రీనివాసరాజు, అందే కోటి వీరభద్రరావు, కుక్కల విజయకుమార్, ఎల్లపు లోకేష్, కాసకోటి వీరభద్రరావు, వీరమళ్ళు శ్రీనివాసరావు, నిల్లవీరభద్రరావుఅందే లింగయ్య, పెచ్చెట్టి నాని, తొంటసుబ్బారావు నేతలు పాల్గొన్నారు.

## పేర్ని నానీ.. నోరు అదుపులో పెట్టుకుంటే నీకే మంచిది!



గన్నవరం (చైతన్యరథం): తమ నాయకుడు, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుపై వ్యక్తిగత విమర్శలు, అసత్య ప్రచారాలు కొనసాగిస్తే రాజకీయంగా, చట్టపరంగా సమాధానం చెబుతామని ఉంగుటూరు టీడీపీ నాయకులు హెచ్చరించారు. ఆదివారం గన్నవరం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఉంగుటూరు మండల అధ్యక్షుడు కొలుసు రవీంద్ర, మండల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, పార్లమెంటరీ ట్రెజరర్ బెజవాడ నాగేశ్వరరావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కొండేటి వెంకటేశ్వరరావు, అత్కూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు అట్లూరి రామకిరణ్ పాల్గొని వైసీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కొలుసు రవీంద్ర మాట్లాడుతూ గన్నవరం, గుడివాడ నియోజకవర్గాల టికెట్లపై పేర్ని నాని చేస్తున్న వ్యాఖ్యలు అనవసరమని అన్నారు. గన్నవరం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రత్యక్షంగా పరిశీలించిన తర్వాత విమర్శలు చేయాలని సూచించారు. గత రెండేళ్లలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నాయకత్వంలో గన్నవరం అభివృద్ధి, దావాజీగూడెం రోడ్డు నిర్మాణం, కృష్ణా యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు, మూతపడిన అశోక్ లేలాండ్ కంపెనీ పునఃప్రారంభం, హెచ్‌సీఎల్ సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు, సీ–డాక్ సంస్థ ఏర్పాటు వంటి అనేక పనులు జరిగాయని చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. విజయ డైరీ చైర్మెన్ చలసాని ఆంజనేయులు సోషల్ మీడియాలో ప్రచారం కోసం రీల్స్ చేస్తూ టీడీపీ కార్యకర్తలమని చెప్పుకుంటున్నారని, అయితే 2019 నుంచి 2024 వరకు పార్టీ కోసం వారు చేసిన సేవలను ప్రజలకు వివరించాలని సవాల్ విసిరారు. పార్టీ కార్యాలయంపై దాడి జరిగిన సమయంలో ఆయన ఎక్కడ ఉన్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మండల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ గన్నవరం గురించి మాట్లాడే నైతిక హక్కు పేర్ని నానికి లేదన్నారు. మెగా డీఎస్సీ ద్వారా వేలాది ఉద్యోగాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లదేనని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో ముందంజలో ఉన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుపై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు. పార్లమెంటరీ ట్రెజరర్ బెజవాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో అక్రమాలు, ఇసుక దందా, గంజాయి, క్రికెట్ బెట్టింగ్ వంటి వ్యవహారాలు పెరిగాయని ఆరోపించారు.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వాటిపై కఠిన చర్యలు తీసుకుంటూ రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడుతోందన్నారు. గన్నవరం నియోజకవర్గంలో రోడ్లు, మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, శిక్షణ కేంద్రాలు, అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని తెలిపారు. మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కొండేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలు వైసీపీని తిరస్కరించి టీడీపీ కూటమికి భారీ మెజారిటీ ఇచ్చిన విషయాన్ని గుర్తుంచుకోవాలని పేర్ని నానికి సూచించారు. గత రెండేళ్లలో సంక్షేమ పథకాలు, రోడ్లు, పరిశ్రమలు, ఉద్యోగ అవకాశాల కల్పనలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విశేషంగా పనిచేస్తున్నారని అన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదని చెప్పారు. అత్కూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు అట్లూరి రామకిరణ్ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనను ప్రజలు తిరస్కరించి టీడీపీ కూటమికి స్పష్టమైన విజయాన్ని అందించారని పేర్కొన్నారు. గన్నవరం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రత్యక్షంగా చూసిన తర్వాతే విమర్శలు చేయాలని పేర్ని నానికి సూచించారు. ప్రజల తీర్పును గౌరవించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావులపై నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని, అభివృద్ధిపై ఎప్పుడైనా చర్చకు సిద్ధంగా ఉన్నామని టీడీపీ నాయకులు స్పష్టం చేశారు.




## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే భాష్యం

పెదకూరపాడు (చైతన్యరథం): 96వ రోజు ప్రజల వద్దకు ప్రవీణ్ 100 రోజులు 100 గ్రామాలు కార్యక్రమాన్ని అమరావతి మండలం నూతలవారిపాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలకు లింక్ రోడ్లు,సీసీ రోడ్లు,డ్రైన్ల నిర్మాణం కోసం కృషి చేస్తున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నియోజకవర్గంలో ఇప్పటికే 60శాతం రోడ్లను నిర్మించామన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను తెలుసుకుని వాటిని ముఖ్యమంత్రి గారికి వివరిస్తామన్నారు. రానున్న రోజుల్లో గ్రామాల్లో అవసరమైన నిధులను తెచ్చి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. ప్రజల వద్ధకు ప్రవీణ్ 100 రోజులు 100 గ్రామాలు కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు వెంటనే పరిష్కారమయ్యేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమయం పట్టే సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సూచించారు. గ్రామంలో సంక్షేమం,అభివృద్ధి కోసం 2 కోట్ల రూపాయలను ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి గ్రామాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామంలో వీధి లైట్లు,విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పనిచేయాలని సూచించారు. గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా పనిచేయాలన్నారు. గ్రామ నాయకులతో సమావేశమై కలిసి కట్టుగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. గ్రామంలోని కార్యకర్తల ఇళ్లలో జరిగిన కార్యక్రమాల నేపథ్యం వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబాలతో మాట్లాడారు.



# స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

## ఎమ్మెల్యే బోడే ప్రసాద్ వెల్లడి

పెనమలూరు (చైతన్యరథం): కృష్ణా నది ఒడ్డున ఉన్నప్పటికీ, దాదాపు 60 నుంచి 70 వేల మంది జనాభా నివసిస్తున్న యనమలకుదురు ప్రాంతం ఎన్నో సంవత్సరాలుగా తాగునీటి సమస్యను ఎదుర్కొంటోందని పెనమలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు సంవత్సరాల్లో గ్రామంలో 10 నుంచి 15 బోర్లు తవ్వించినప్పటికీ,350 అడుగుల లోతు వరకు వెళ్లినా సరైన స్థాయిలో నీరు లభించలేదని,లభించిన నీటిలో కూడా టిడిఎస్ స్థాయిలు 1300 నుంచి 1500 వరకు ఉండటంతో తాగునీటిగా ఉపయోగించడానికి అనుకూలంగా లేకపోయిందని ఆయన వివరించారు, అధిక టిడిఎస్ కారణంగా గ్రామంలోని పైప్‌లైన్లు స్కేలింగ్‌కు గురై నీటి సరఫరా ఒత్తిడి కూడా తగ్గిపోయిందన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా కృష్ణా నది మధ్య ప్రాంతంలో బోర్ ఏర్పాటు చేసి,అక్కడి నుంచి పైప్‌లైన్ ద్వారా స్వచ్ఛమైన నీటిని గ్రామానికి తీసుకురావాలని నిర్ణయించామని తెలిపారు,నదిలో లభిస్తున్న నీరు గ్రామంలో ప్రస్తుతం ఉన్న నీటి కంటే ఎంతో నాణ్యమైనదిగా ఉండటంతో ప్రజలకు మెరుగైన తాగునీరు అందించగలమనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు చెప్పారు. రూ.1.05 కోట్ల వ్యయంతో నది నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేసి,గ్రామంలోని కొండపై ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్‌తో పాటు పంచాయతీ కార్యాలయం సమీపంలోని ట్యాంకుకు కూడా అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. రాబోయే 20 నుంచి 30 రోజుల్లో ఈ పనులను పూర్తి చేసి గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులోకి తీసుకురానున్నామని పేర్కొన్నారు.



అదేవిధంగా డొంక రోడ్డులో రూ.28 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేసినట్లు తెలిపారు,మొత్తంగా రూ.1.33 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఇటీవల వినాయక నగర్, పోలీస్ కాలనీ ప్రాంతాల్లో రూ.6 కోట్ల వ్యయంతో రోడ్లు,డ్రైన్ల అభివృద్ధి పనులు చేపట్టామని, గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో యణమలకుదురు లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని గుర్తు చేశారు,ప్రస్తుత ప్రభుత్వంలో కూడా గత రెండేళ్లలోనే దాదాపు రూ.7 నుంచి రూ.8 కోట్ల వరకు రోడ్ల అభివృద్ధి కోసం ఖర్చు చేశామని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని, ముఖ్యంగా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ఒక కీలక అడుగు వేశామని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పేర్కొన్నారు.




# నాణ్యమైన విద్యాసంస్థల అవసరం పెరుగుతోంది

## చీరాల ఇంజనీరింగ్ కాలేజీ ప్రాంగణంలో ఆల్టస్ పాఠశాల ప్రారంభం, పాల్గొన్న ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య

చీరాల (చైతన్యరథం): చీరాల ఇంజనీరింగ్ కాలేజీ ప్రాంగణంలో ఆల్టస్ అంతర్జాతీయ పాఠశాల పారంభోత్సవం జరిగింది. కార్యక్రమంలో చీరాల శాసనసభ్యుడు మద్దులూరి మాలకొండయ్య పాల్గొన్నారు. విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో చీరాల ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన ఆల్టస్‌ను ఆదివారం ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి పాఠశాలను ప్రారంభించారు. కార్యక్రమానికి రాజకీయ, సామాజిక, విద్యా రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై యాజమాన్యానికి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు అత్యుత్తమ విద్యను అభ్యసించడం ఎంతో అవసరమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా నగరాలకు ఏమాత్రం తీసిపోని విద్యా సదుపాయాలు అందుబాటులోకి రావడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులలో జ్ఞానంతో పాటు నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించే విద్యాసంస్థల అవసరం ప్రస్తుతం మరింత పెరిగిందన్నారు.



# బెస్త కులస్తులకు, మత్స్యకారులకు సీఎం చంద్రబాబు అండ

## జిల్లా బెస్త సేవా సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన చేపల హరికి శుభాకాంక్షలు తెలిపిన పూల నాగరాజు

అనంతపురం (చైతన్యరథం): జిల్లా బెస్త సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన చేపల హరికి అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనంతపురం నగరంలోని ఆదర్శ నగర్ లోని బెస్త సంఘం ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్ , గుమ్మనూరు జయరాం, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, బెస్త కుల సంఘాల నాయకులు, బిసి సంఘం నేతలతో కలిసి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పూల నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బెస్త సామాజిక వర్గానికి చెందిన నాయకులు అన్ని రంగాల్లో ఎదగాలని, జిల్లా బెస్త సంఘం



అధ్యక్షుడిగా ఎన్నికైన చేపల హరి సమాజ అభ్యున్నతి కోసం మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. అనంతపురంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌గా పార్టీ బలోపేతానికి కృషి చేసిన హరి గారికి ఈ బాధ్యతలు రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో బీసీల సంక్షేమం, మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే బీసీలకు పెద్దపీట వేస్తూ వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారత కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందనడానికి మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన కొల్లు రవీంద్రను రాష్ట్ర మంత్రివర్గంలో కీలక మంత్రిగా నియమించడం నిదర్శనం అని పూల నాగరాజు పేర్కొన్నారు. బీసీలకు రాజకీయంగా సముచిత గుర్తింపు కల్పిస్తూ, మత్స్యకారుల స్వరం ప్రభుత్వ స్థాయిలో బలంగా వినిపించే అవకాశం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదేనన్నారు. అదేవిధంగా బీసీ వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.

మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడేలా చేపల ఉత్పత్తి పెంపు, జల వనరుల అభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణ, మత్స్యకార కుటుంబాల ఆర్థిక బలోపేతానికి అవసరమైన చర్యలు చేపడుతోందని వివరించారు. రాష్ట్ర అభివృద్ధిలో బెస్త కులస్తులు, మత్స్యకారుల పాత్ర ఎంతో కీలకమని, వారి సంక్షేమం అభ్యున్నతికి తెలుగుదేశం ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లా బెస్త సేవా సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన చేపల హరి గారు బెస్త కులస్తుల సమస్యల పరిష్కారం, సామాజిక ఐక్యత అభివృద్ధి కోసం మరింత చురుకుగా పనిచేయాలని ఆకాంక్షిస్తూ మరోసారి అభినందనలు తెలిపారు.

జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం

# పకడ్బందీగా ఓటర్ల జాబితా సవరణ : ఎమ్మెల్యే కావ్య




కావలి (చైతన్యరథం): భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై ప్రజల్లో, పార్టీ నాయకుల్లో అవగాహన పెంపొందించేందుకు ఆదివారం కావలి పట్టణంలోని దొడ్ల మనోహర్ రెడ్డి కళ్యాణ మండపంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి, కావలి నియోజకవర్గ పరిశీలకులు జయంతి బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, కొత్త ఓటర్ల నమోదు, అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటర్ల జాబితాలో ఉండేలా తీసుకోవాల్సిన చర్యలు, తప్పుల సవరణ, చిరునామా మార్పులు వంటి అంశాలపై నాయకులకు వివరణ ఇచ్చారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, ఓటర్ల జాబితాలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని నాయకులకు సూచించారు. ప్రతి బూత్ పరిధిలో ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరుగా నమోదు కావడం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో కావలి నియోజకవర్గ పట్టణ,మండల పార్టీ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ, బూత్ కన్వీనర్ ,బూత్ కో కన్వీనర్, యూనిట్, కో యూనిట్, క్లస్టర్, కో క్లస్టర్లు, ప్రధాన కార్యదర్శిలు,వార్డు, గ్రామ పంచాయతీ ప్రెసిడెంట్, సెక్రటరీ ముఖ్య నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు భారీగా పాల్గొన్నారు..



# సమష్టి కృషితో సమగ్ర ఓటరు జాబితా

## తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పిలుపు

నెల్లూరు (చైతన్యరథం): రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా పున:పరిశీలనపై తెలుగుదేశం పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు, తెలుగుదేశం పార్టీ నాయకులతో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి అవగాహన సమావేశం నిర్వహించారు. బీఎల్ఏలకు సర్ కార్యక్రమంలో చేపట్టవలసిన కార్యాచరణపై కీలక సూచనలు చేశారు. ఓటరు జాబితాల రివిజన్ ప్రక్రియ 24 ఏళ్ల తర్వాత ఎలక్షన్ కమిషన్ చేపట్టిందని, ప్రతి ఒక్క బీఎల్ఏ. తెలుగుదేశం పార్టీ నాయకులు సర్ కార్యక్రమంలో భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వచ్చేనెల 15 నుంచి జూలై 14వ తేదీ వరకు బీఎల్ఓలు ఇంటింటికీ వచ్చి ఓటర్ల వివరాలు సేకరిస్తారన్నారు. జూలై 14న పోలింగ్ స్టేషన్ల పునర్ వ్యవస్థీకరణ చేపడుతారని వివరించారు. జూలై 21వ తేదీ నాటికి ముసాయిదా ఓటరు జాబితాలు ప్రచురిస్తారని తెలిపారు. ఆగస్టు 20వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. సెప్టెంబర్ 18వ తేదీ లోపు అభ్యంతరాలను పరిష్కరించి 22వ తేదీన తుది జాబితాలు ప్రకటిస్తారన్నారు. కొత్తగా ఓటు నమోదు, తప్పుల సవరణ, ఓట్ల తొలగింపునకు కూడా అవకాశం కల్పిస్తారన్నారు. సర్ తర్వాత ఒక్కో నియోజకవర్గంలో వేలాది చెల్లని ఓట్లు తగ్గిపోయే అవకాశం ఉందన్నారు. బీఎల్ఓలతో కలిసి జాబితాలను పరిశీలించడంలో బీఎల్ఏలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పై కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జీలు, కో క్లస్టర్ ఇంచార్జ్ లు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సొంత నిధులతో బకింగ్‌హామ్ కాలువ బ్రిడ్జి మరమ్మతులు


## మత్స్యకారులకు ఎంపీ వీపీఆర్ హామీ

నెల్లూరు (చైతన్యరథం): కందుకూరు నియోజకవర్గం, ఉలవపాడు మండలం, చాకిచెర్ల పరిధిలోని పెద్దపట్టపుపాళెం గ్రామానికి చెందిన మత్స్యకార సంఘ నూతన పెద్ద కాపులు నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మత్స్యకారులు ఎదుర్కొంటున్న కొన్ని కీలక సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. పెద్దపట్టపుపాళెం గ్రామ మత్స్యకారులు తమ జీవనోపాధి కోసం నిత్యం గ్రామ సమీపంలోని సముద్రంలోకి వెళ్లాల్సి ఉంటుందని, అయితే, మార్గమధ్యంలో ఉన్న బకింగ్‌హామ్ కెనాల్ బ్రిడ్జి తీవ్రంగా దెబ్బతిందని పెద్ద కాపులు ఎంపీకి వివరించారు. దీనిపై తక్షణమే స్పందించిన ఎంపీ, మత్స్యకారుల ప్రయోజనాల దృష్ట్యా తన సొంత నిధులతో ఆ బ్రిడ్జికి మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఎంపీ ల్యాడ్స్ నిధుల ద్వారా గ్రామంలోని ప్రధాన వీధికి సీసీ రోడ్డును మంజూరు చేస్తానని వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి హామీ ఇచ్చారు.



# మంత్రి లోకేశ్ చొరవతో ప్రగతిపథంలో ప్రభుత్వ పాఠశాలలు

## మూలా పేటలో 20 కోట్లతో కార్పొరేట్ స్థాయిలో డీఎస్ఆర్ హైస్కూల్, పురపాలక మంత్రి నారాయణ




నెల్లూరు (చైతన్యరథం): విద్యావ్యవస్థలో సరికొత్త చరిత్ర సృష్టిస్తూ నెల్లూరు (చైతన్యరథం): నగరంలో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీసుకొస్తున్న విప్లవాత్మక సంస్కరణల్లో భాగంగా, నెల్లూరు 39వ డివిజన్ మూలాపేటలో దాదాపు 20 కోట్ల రూపాయల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్ధమౌతున్న డీఎస్ఆర్ ప్రభుత్వ హైస్కూల్‌ను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పరిశీలించారు. గత ప్రభుత్వం మూసివేసిన విఆర్ హైస్కూల్ ని అంతర్జాతీయ ప్రమాణాలతో పునఃప్రారంభించారు. అదే స్ఫూర్తితో, ఇప్పుడు మూలపేటలో ఒక కోటలాంటి అద్భుతమైన స్కూల్ బిల్డింగ్‌ను డిఎస్సార్ కనస్ట్రక్షన్స్ అధినేత దేవిరెడ్డి సుధాకర్ రెడ్డి సహకారంతో ఏర్పాటు చేశారు. పనులను మంత్రి నారాయణ పర్యవేక్షించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో అందుబాటులోకి వచ్చిన ఈ కొత్త ప్రాంగణంలో, 24,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో 14 హైటెక్ క్లాస్‌రూమ్‌లను కేవలం ఎనిమిది నెలల రికార్డు కాలపరిమితిలో పూర్తి చేసి ఫర్నిచర్‌ను సిద్ధం చేశారన్నారు. ఇందులో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కంప్యూటర్ ల్యాబ్‌లతో పాటు రాష్ట్రంలోనే అత్యంత ఆధునికమైన రోబోటిక్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం విశేషం అన్నారు. కేవలం చదువే కాకుండా, పిల్లల ఆటల కోసం బెంగళూరు నిపుణులతో ప్రత్యేకంగా సింథటిక్ ఎనామిల్ కోటింగ్ వేయించిన కబడ్డీ కోర్ట్, క్రికెట్ నెట్, హాఫ్ బాస్కెట్‌బాల్, రెండు బాడ్మింటన్ కోర్టులు, చిల్డ్రన్ ప్లే ఏరియాలను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దారన్నారు. సురక్షితమైన ఆర్వో ప్లాంట్ తాగునీరు, ప్రథమ చికిత్స కోసం ప్రత్యేక సిక్ రూమ్ కూడా ఇక్కడ అందుబాటులోకి వచ్చాయన్నారు. స్కూల్ ఆధునీకరణకు ముందుకొచ్చి శరవేగంగా పనులు పూర్తి చేసిన సుధాకర్ రెడ్డిని, వారి కుటుంబ సభ్యులను మంత్రి నారాయణ అభినందించారు. డిఎస్సార్ కనస్ట్రక్షన్స్ అధినేత వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది ఆగస్టులో మంత్రి నారాయణ హైదరాబాద్ నుండి ప్రత్యేకంగా ఫోన్ చేసి నెల్లూరు మున్సిపల్ స్కూల్స్ డెవలప్‌మెంట్ ప్రపోజల్ పెట్టారన్నారు. ఆయనపై గౌరవంతో మూలాపేట హైస్కూల్‌ను 8 నెలల్లో కార్పొరేట్ స్థాయిలో నిర్మించడానికి అంగీకరించానని తెలిపారు. 2.5 ఎకరాల స్థలంలో, మొదటి దశలో 24,000 చదరపు అడుగుల్లో 14 క్లాస్‌రూమ్‌లు, అధునాతన ల్యాబ్స్, ఆర్ఓ ప్లాంట్, సిక్ రూమ్‌లతో పాటు బెంగళూరు నిపుణులతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కబడ్డీ, క్రికెట్, బాస్కెట్‌బాల్, బాడ్మింటన్ కోర్టులను సిద్ధం చేశామన్నారు. ఈ నిర్మాణానికి సహకరించిన మూలాపేట ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన ఆయన, నెల్లూరులో ఎంతోమంది ఉన్నా తనను నమ్మి ఈ గొప్ప అవకాశాన్ని కల్పించిన మంత్రి నారాయణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత అశోక్ ,39వ డివిజన్ క్లస్టర్ ఇన్‌చార్జ్ అన్నంగి ప్రసాద్ అధ్యక్షుడు మనోహర్, జనరల్ సెక్రటరీ మధురెడ్డి,ఉపాధ్యక్షుడు మురళి, దీనదయాళ్, విజయ్, నాని స్థానిక ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జోన్-5
(నంద్యాల, కర్నూలు, హిందూపురం, అనంతపురం, కడప)
చైతన్యరథం

# కళ్లున్న కబోధులు వైసీపీ మూకలు

**రూ.2.80 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి సవిత**



సోమందేపల్లి (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా రహదారుల నిర్మాణ పనులు చేపడుతున్నామని బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలోని సోమందేపల్లి మండలం పాపిరెడ్డిపల్లి నుంచి తుంగోడు క్రాస్ వరకు రూ. 2.80 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను మంత్రి సవిత పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల ఆర్థిక, సామాజిక పురోగతికి రహదారుల అభివృద్ధి కీలకమని అన్నారు. రైతులు, విద్యార్థులు, వ్యాపారులు సులభంగా రాకపోకలు సాగించేలా మెరుగైన రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం కోట్లాది రూపాయల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ప్రత్యక్షంగా కనిపిస్తున్నప్పటికీ, వాటిని గుర్తించకుండా విమర్శలు చేయడం ప్రతిపక్ష నాయకుల వైఖరికి నిదర్శనమన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, రాజకీయ విమర్శల కంటే అభివృద్ధికే ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. పెనుకొండ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు, .ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పల్లా కుటుంబంలో పరిమళించిన మానవత్వం

విశాఖపట్టణం (చైతన్యరథం): రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా, కష్టాల్లో ఉన్న కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలవడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న గాజువాక నియోజకవర్గ పల్లా కుటుంబం మరోసారి తమ ఉదారతను చాటుకుంది. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు తండ్రి పల్లా సింహాచలం ప్రథమ వర్ధంతి. సందర్భంగా పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గాజువాక నియోజకవర్గంలో చనిపోయిన తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కలిగిన కార్యకర్తల కుటుంబాలకు (దాదాపు 200 మందికి) మట్టి ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి 10,000 చొప్పున, మొత్తంగా రూ. 20 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సేవా కార్యక్రమంలో భాగంగా మన 86వ వార్డు నుంచి కూడా చనిపోయిన కార్యకర్తల కుటుంబాలకు (20 మందికి) పల్లా శ్రీనివాసరావు ఆర్థిక సాయాన్ని అందించి ఆదుకున్నారు.





# ఎస్ఐఆర్‌ను సీరియస్‌గా తీసుకోవాలి

**పార్టీ శ్రేణులకు పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ సూచన**



రాప్తాడు (చైతన్యరథం): కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రతి ఒక్కరూ సీరియస్ గా తీసుకోవాలని రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీత, ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ పార్టీ శ్రేణులకు సూచించారు. రామగిరి మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వారు రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు, కో కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జిలు, బూత్ కన్వీనర్లు, బూత్ లెవెల్ ఏజెంట్లతోపాటు ఆయా మండలాల ముఖ్యనాయకులంతా పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐఆర్ కార్యక్రమం గురించి వారు పార్టీ శ్రేణులకు వివరించారు. ఈ కార్యక్రమం ఈనెల 15వ తేది నుంచి చేపట్టబోతోందని కావున క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీ 20-25 ఏళ్లకోసారి స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ జరుగుతుందని.. 2002 ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకుని స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ప్రక్రియను చేస్తున్నారన్నారు. జులై 14వ తేదీలోగా రెండుసార్లు ఓట్ల మ్యాపింగ్ చేస్తారని వివరించారు. ఎస్ఐర్ జరుగుతున్న సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. జులై 15 నుంచి ఆగస్టు నెలాఖరు వరకు ఇంటింటి ప్రచారం చేపట్టాల్సి ఉంటుందన్నారు. దీని పట్ల నిర్లక్ష్యంగా ఉంటే మనకు సంబంధించిన ఓట్లు పోయే ప్రమాదం ఉందన్నారు. ఓట్ల ఎన్‌రోల్‌మెంట్ జరుగుతోందని, ఓట్ల చేరికలపై ప్రజలకు అవగాహన కల్పించడం రాజకీయ పార్టీగా మన ప్రాథమిక బాధ్యత అని తెలిపారు. ఏ ఎన్నికలకైనా ఓటర్ల జాబితా అనేది చాలా కీలకమని అన్నారు. కావున ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని కూడా సీరియస్ తీసుకుని పని చేయాలని వారు సూచించారు. ఈ సందర్భంగా పోలింగ్ బూతుల వారిగా ఓటర్ జాబితాలను నాయకులకు అందజేశారు.

# రాయదుర్గం పట్టణానికి మహర్దశ

**పారిశుద్ధ్యం మెరుగుదలకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కితాబు**



రాయదుర్గం (చైతన్యరథం): పట్టణ పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. రాయదుర్గం డంపింగ్ యార్డులో జరుగుతున్న చెత్త శుద్ధి, వ్యర్థాల నిర్వహణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో దశాబ్దాలుగా పేరుకుపోయిన చెత్తకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటోందన్నారు. రాయదుర్గం డంపింగ్ యార్డులో సుమారు లక్ష మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయిందని, దానిని శాస్త్రీయ పద్ధతుల్లో శుద్ధి చేసి ఎరువుగా మార్చే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 40 వేల మెట్రిక్ టన్నుల చెత్తను ఎరువుగా మార్చగా, మరో 60 వేల మెట్రిక్ టన్నుల చెత్తను శుద్ధి చేయాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియ సెప్టెంబర్ నాటికి పూర్తవుతుందని అధికారులు తెలియజేశారని చెప్పారు. 1963లో రాయదుర్గం మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి సుమారు 63 సంవత్సరాలుగా పేరుకుపోయిన చెత్తను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తొలిసారిగా పూర్తిస్థాయిలో శుభ్రపరుస్తుండటం సంతోషకరమన్నారు. ఈ చెత్త శుద్ధి కార్యక్రమం కోసం సుమారు రూ. 8 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని వ్యక్తిగత మరుగుదొడ్ల నుంచి సేకరించే మలినాలను శాస్త్రీయ పద్ధతిలో శుద్ధి చేసే ప్రత్యేక యూనిట్‌ను రూ. 2కోట్లతో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ప్రాసెసింగ్ చేసే ఆధునిక వ్యర్థాల నిర్వహణ యూనిట్‌ను మరో రూ. 3 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేశామని వివరించారు. పట్టణ పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు సుమారు రూ. 13 కోట్ల వ్యయంతో ఈ సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో పట్టణం నుంచి వచ్చే చెత్తతో పాటు వ్యక్తిగత మరుగుదొడ్ల మలినాలను కూడా ఇక్కడే శుద్ధి చేయడం ద్వారా రాయదుర్గాన్ని పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పరిశుభ్రత, ప్రజారోగ్యంపై ఉన్న నిబద్ధతకు ఇవే నిదర్శనమన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రతిరోజూ మున్సిపల్ కమిషనర్లతో సమీక్షలు నిర్వహిస్తూ చెత్త శుద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ఈ కార్యక్రమాలు ప్రతిబింబిస్తున్నాయన్నారు. రాయదుర్గం ప్రజల తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిలకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణమూర్తి , క్లస్టర్ ఇంఛార్జిలు, పోరాళ్ల పురుషోత్తం, ఇనాయత్, మాజీ చేనేత కార్పొరేషన్ డైరెక్టర్ టశీకశాల హనుమంతు, కొండాపురం శ్రీనివాసులు,కురుబ ఎల్లప్ప, పోరాళ్ల ధనర్జున, ఖలందర్, బట్టి తిప్పస్వామి, మెకానిక్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## నాష్‌విల్లేలో టెన్నెస్సీ తెలుగు సమితి
# పికిల్‌బాల్ టోర్నీ ఘన విజయం



నాష్ విల్లే: అమెరికాలోని నాష్‌విల్లేలో టెన్నెస్సీ తెలుగు సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన 'మెన్స్ డబుల్స్ పికిల్‌బాల్ టోర్నమెంట్' అత్యంత వైభవంగా ముగిసింది. స్థానిక తెలుగు కమ్యూనిటీని ఒకే తాటిపైకి తీసుకురావడంతో పాటు క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన ఈ క్రీడా సంబరానికి అద్భుతమైన స్పందన లభించింది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 21 జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. నాలుగు కోర్టుల్లో లీగ్ ఫార్మాట్ పద్ధతిలో హోరాహోరీగా ఈ మ్యాచ్‌లు జరిగాయి. మొదటి సెమీఫైనల్ మ్యాచ్ 'కిచెన్ నింజాస్' (సుమన్ పాకాల/జేసన్ పసానిస్) వర్సెస్ 'నాసా' (నందన్ గౌడ/సత్యం పైలా) జట్ల మధ్య జరిగింది. రెండవ సెమీఫైనల్ మ్యాచ్ 'దేశీ క్రూ' (శ్రీనివాస్ మెర్నేడి–సత్య అక్కిన) వర్సెస్ 'ర్యాలీ రెబెల్స్' (విశ్రుత్‌రెడ్డి –రవి.కె) జట్ల మధ్య హోరా హోరీగా సాగింది. కిచెన్ నింజాస్ (సుమన్ పాకాల/జేసన్ పసానిస్) మొదటిస్థానం, దేశీ క్రూ (శ్రీనివాస్ మెర్నేడి/సత్య అక్కిన) ద్వితీయ స్థానం, ర్యాలీ రెబెల్స్ (విశ్రుత్ రెడ్డి –రవి.కె) తృతీయస్థానాల్లో నిలిచారు. ఈ క్రీడా ఈవెంట్‌ను విజయవంతం చేసిన విజేతలకు, రన్నర్స్‌కు, పాల్గొన్న క్రీడాకారులకు, సహకరించిన నిర్వాహకులకు, వాలంటీర్లకు టెన్నెస్సీ తెలుగు సమితి ప్రతినిధులు హారిక కనగాల, విష్ణు నెల్లూరి తదితరులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ టోర్నమెంట్‌ను టీటీఎస్ చరిత్రలో మైలురాయిగా నిలిపాయని పేర్కొన్నారు.

## మిల్లర్స్ పార్క్‌లో ఉత్సాహంగా
# మాటా త్రోబాల్ టోర్నమెంట్

పెన్సిల్వేనియా: మన అమెరికన్ తెలుగు అసోసియేషన్ (మాటా) ఆధ్వర్యంలో పెన్సిల్వేనియాలోని మిల్లర్స్ పార్క్‌లో నిర్వహించిన మహిళల త్రోబాల్ టోర్నమెంట్ ఉత్సాహభరితంగా జరిగింది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన జట్లు పోటీల్లో పాల్గొని క్రీడా ప్రతిభను చాటాయి. మహిళల్లో క్రీడాస్ఫూర్తి, ఆరోగ్య చైతన్యం మరియు జట్టు స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌కు తెలుగు కమ్యూనిటీ నుంచి విశేష స్పందన లభించింది. పోటీలు ఆద్యంతం ఆసక్తికరంగా సాగగా కుటుంబసభ్యులు, ప్రేక్షకులు క్రీడాకారిణులను ఉత్సాహపరిచారు. టోర్నమెంట్‌లో విజేతలు, రన్నరప్ జట్లకు బహుమతులను మాటా 2వ జాతీయ కన్వెన్షన్‌లో ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జూన్ 19–20 తేదీలలో పెన్సిల్వేనియాలోని ఓక్స్ నగరంలో జరగనున్న ఈ మహాసభలకు వేలాది మంది తెలుగు ప్రజలు హాజరుకానున్నారు. క్రీడలు, సంస్కృతి, సేవా కార్యక్రమాల ద్వారా తెలుగు సమాజాన్ని మరింతగా ఏకం చేయాలనే లక్ష్యంతో మాటా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు.



## ఫ్రామ్ సెంటర్ సందర్శన
# గౌరవంగా భావిస్తున్నాం




### ఎంపీలు శ్రీభరత్, శబరి



ట్రోంసా (నార్వే): నాలెడ్జ్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లో భాగంగా ట్రోంసోలోని ఫ్రామ్ సెంటర్‌ను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంపీల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఎంపీలు శ్రీభరత్, బైరెడ్డి శబరి మాట్లాడుతూ వాతావరణ మార్పులు, ధ్రువ ప్రాంతాల పరిశోధనలు, పర్యావరణ పరిరక్షణపై జరిగిన చర్చలు భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రపంచదేశాల సహకారం ఎంత ముఖ్యమో తెలియజేశాయని పేర్కొన్నారు. శాస్త్ర సాంకేతిక ఆధారిత పరిష్కారాలు, అంతర్జాతీయ సహకారమే స్థిరమైన భవిష్యత్తుకు మార్గమనే విషయాన్ని మరింత బలంగా చాటి చెప్పిన విలువైన అనుభవం ఇది అని పేర్కొన్నారు. ఫ్రాం సెంటర్ సందర్శనను గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు.

## సాన్ ఆంటోనియోలో
# సీతారామ కళ్యాణం



సాన్ ఆంటోనియో: అమెరికాలోని సాన్ ఆంటోనియో నగరం ఇటీవల భక్తిరసంతో నిండిపోయింది. మాన అమెరికన్ తెలుగు అసోసియేషన్ (మాటా) ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారామ కళ్యాణ మహోత్సవం తెలుగు కుటుంబాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించింది. సీతారాముల దివ్య కళ్యాణాన్ని వేదమంత్రోశ్చారణలతో నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. భజనలు, ప్రత్యేక అర్చనలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక కాంతితో కళకళలాడింది. కుటుంబసమేతంగా హాజరైన భక్తులు ధార్మిక కార్యక్రమాలను ఆస్వాదిస్తూ దైవ అనుగ్రహాన్ని పొందారు. విదేశాల్లో పెరుగుతున్న తరాలకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను పరిచయం చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు. సమాజంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు భక్తి, సేవా భావాలను ప్రోత్సహించే వేదికగా మాటా కార్యక్రమాలు నిలుస్తున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ, సామూహిక భోజన ఏర్పాట్లు చేయగా, పాల్గొన్న వారంతా ఆనందాన్ని వ్యక్తం చేశారు. స్థానిక తెలుగు సంఘాలు, కుటుంబాలు, పెద్దఎత్తున యువత పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా మాటా ప్రతినిధులు సంస్థ నిర్వహించనున్న రెండవ జాతీయ కన్వెన్షన్‌పై వివరాలు వెల్లడించారు.

జూన్ 19, 20 తేదీలలో పెన్సిల్వేనియాలోని ఓక్స్ నగరంలో గల గ్రేటర్ ఫిలడెల్ఫియా ఎక్స్‌పో సెంటర్‌లో ఈ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సుమారు ఆరు వేల మందికి పైగా తెలుగు ప్రజలు దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశముందని అంచనా వేస్తున్నారు. రెండురోజుల పాటు జరిగే ఈ మహాసభల్లో సాంస్కృతిక ప్రదర్శనలు, యువత కార్యక్రమాలు, వ్యాపార నెట్ వర్కింగ్ సమావేశాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రముఖ కళాకారుల వినోద కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణలుగా నిలవనున్నాయి. తెలుగు వారసత్వాన్ని, సంస్కృతిని, కమ్యూనిటీ బంధాలను మరింత బలోపేతం చేసే వేదికగా ఈ కన్వెన్షన్ నిలవనుందని నిర్వాహకులు తెలిపారు.

# 19 నుంచి మాటా రెండో మహాసభలు

పెన్సిల్వేనియా: మన అమెరికా తెలుగు సంఘం (మాటా) ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'మాటా సెకండ్ కన్వెన్షన్ '26' మహాసభలకు సర్వం సిద్ధమైంది. ఈ సంవత్సరం జూన్ 19 నుంచి 20 వరకు రెండురోజుల పాటు పెన్సిల్వేనియాలోని 'ది గ్రేటర్ ఫిలడెల్ఫియా ఎక్స్‌పో సెంటర్', ఓక్స్‌లో ఈ వేడుకలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. అమెరికాలోని తెలుగు సమాజాన్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చే ప్రతిష్ఠాత్మక సంస్థ మన అమెరికన్ తెలుగు అసోసియేషన్ (మాటా) ఆధ్వర్యంలో మహాసభలు ఘనంగా నిర్వహించనున్నారు. మహాసభకు ముఖ్యఅతిథిగా ప్రముఖ సినీనటి జయప్రద హాజరుకానున్నారు. అదేవిధంగా ప్రముఖ వ్యాఖ్యాత సుమ కనకాల, గాయని సమీరా భారద్వాజ్, నటి ఐశ్వర్య రాజేష్, రీటా, నిఖిల్, అలి, రామచారి, స్వాతిరెడ్డి తదితర సినీ, టెలివిజన్ ప్రముఖులు పాల్గొననున్నారు. వినోద కార్యక్రమాలలో భాగంగా ప్రముఖ గాయకుడు రామ్ మిరియాల ప్రత్యేక సంగీత విభావరితో ప్రేక్షకులను అలరించనుండగా, సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగే గ్రాండ్ ఫినాలే కాన్సర్ట్ మహాసభకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఈ మహాసభల్లో ప్రవాస తెలుగు వారిని అలరించడానికి ఆధ్యాత్మిక, సాంస్కృతిక, వినోద కార్యక్రమాలను భారీఎత్తున ప్లాన్ చేశారు. భద్రాచల సీతారామ కళ్యాణం భక్తుల కోసం ప్రత్యేకంగా నిర్వహించనున్నారు. 'మాటా సింగింగ్ స్టార్' పోటీలతో పాటు మ్యాట్రిమోనీ విభాగం, యూత్ విభాగాలు ఉంటాయి. సీఎంఈ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బిజినెస్, పొలిటికల్, లీగల్ ఫోరమ్‌లను నిర్వహించనున్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు, ఫ్యాషన్ షో, ఉమెన్ ఫోరమ్స్, అవార్డుల ప్రదానోత్సవం, సెలబ్రిటీ మూవీ స్టార్స్ సందడి చేయనున్నారు. వెండర్స్/ ఎగ్జిబిట్స్ కోసం కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

### నిర్వాహక కమిటీ పర్యవేక్షణ

ఈ వేడుకలను 'మాటా' ప్రెసిడెంట్ రమణ కిరణ్ దూదిపాక, కన్వీనర్ శ్రీధర్ గూడాల, కో–కన్వీనర్లు టోని జన్ను, దాము గేదెల, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ గూడూరులతో కూడిన కోర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. వారితో పాటు కన్వెన్షన్ అడ్వైజరీ కమిటీ సభ్యులు శ్రీనివాస్ గనగోని (ఫౌండర్), ప్రదీప్ సమల (ఫౌండర్), జితేందర్ రెడ్డిలు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ మహాసభలకు xpat.money, MSN Realty సంస్థలు మెగా స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయి. టికెట్లు, వెండర్ రిజిస్ట్రేషన్ల కోసం చిత్రంలో క్యూఆర్ కోడ్‌లను అందుబాటులో ఉంచారు. మరిన్ని వివరాల కోసం మాటా హెల్ప్‌లైన్ నెంబర్ +1888-762-8287) సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.




### 20న లీగల్ ఫోరం

మన అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన మాటా 2వ కన్వెన్షన్ మహాసభల వేదికగా ప్రవాస తెలుగువారి కోసం ప్రత్యేకంగా 'లీగల్ ఫోరమ్' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జూన్ 20వ తేదీ శనివారం మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు ఈ లీగల్ ఫోరమ్ సదస్సు జరగనుంది. ప్రవాసులకు చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశం. అమెరికాలోని ప్రముఖ న్యాయనిపుణులు మోడరేటర్లు, ప్రెజెంటర్లుగా వ్యవహరించి సందేహాలను నివృత్తి చేయనున్నారు. వారిలో సోమిరెడ్డి లా గ్రూప్ వ్యవస్థాపక భాగస్వామి సంతోష్ ఆర్.సోమిరెడ్డి, కంప్యూనెల్ ఇంక్ జనరల్ కౌన్సెల్ ప్రేమా రొద్దం, పటూరి లా వ్యవస్థాపక భాగస్వామి మధురిమ పటూరి పాల్గొననున్నారు. ఈ లీగల్ ఫోరమ్‌కు ప్రేమా రొద్దం అడ్వైజర్‌గా వ్యవహరిస్తుండగా..కళ్యాణి బెల్లంకొండ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు.

# టీఎంసీ ఎమ్మెల్యే వాహనంపై కోడిగుడ్లతో దాడి



కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే మదన్ మిత్రా కు చేదు అనుభవం ఎదురైంది. కమార్‌హాటీ నియోజకవర్గంలోని అరియాదయా ప్రాంతంలో కొంత గందరగోళ పరిస్థితులున్నాయనే సమాచారంతో ఆయన అక్కడకు వెళ్లారు. అప్పుడికే అక్కడకు చేరుకున్న స్థానికులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. కొందరు ఆగ్రహంతో కోడిగుడ్లు విసరడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. దీంతో ఎమ్మెల్యే కాన్వాయ్ అక్కడి నుంచి ముందుకు వెళ్లిపోయింది. దాడి ఘటనపై మదన్ మిత్రా స్పందిస్తూ, ఈ ఘటన పూర్తిగా ముందస్తు వ్యూహంపై జరిగినదేనని, బీజేపీ మద్దతుతోనే కొందరు దుండగులు ఈ దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. అయితే దాడి సమయంలో తాను వాహనంలో లేనని, తన డ్రైవర్‌పై దాడి జరిగిందని చెప్పారు. కాగా, దశాబ్దాలుగా 'కట్ మనీ' పేరుతో స్థానిక నేతలు తమవద్ద బలవంతంగా డబ్బులు వసూళ్లు చేశారని, వాటిని తిరిగి ఇవ్వాలని ఆటో-రిక్షా, ఈ-రిక్షా డ్రైవర్లు చేపట్టిన నిరసన ఉద్రిక్తతకు దారితీసినట్లు చెబుతున్నారు.

**పెరుగుతున్న ప్రజాగ్రహం**

పశ్చిమబెంగాల్‌లో పలువురు టీఎంసీ నేతలకు వ్యతిరేకంగా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వరుస ఘటనలు ఇటీవల కాలంలో చోటుచేసుకుంటున్నాయి. గత కొద్దివారాలుగా రాష్ట్రం లోని వివిధ ప్రాంతాల్లోని ప్రజలు బహిరంగంగానే నాయకుల అవినీతి ఆరోపణలు, బలవంతపు వసూళ్లు, స్థానిక పాలనాంశాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వరకూ రాజకీయ ర్యాలీలకే పరిమితమైన ప్రజా నిరసనలు ఈ మధ్యకాలంలో రాజకీయ నేతల పర్యటనల్లో చోటుచేసుకుంటున్నాయి. టీఎంసీ ఎంపీ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఇటీవల సోనార్‌పూర్‌లో పర్యటించినప్పుడు ఇలాంటి నిరసనలే ఎదుర య్యాయి. అభిషేక్ 'దొంగ' అంటూ నినాదాలు చేసిన నిరసన కారులు ఆయనపై రాళ్లు, కోడిగుడ్లు విసిరారు. స్థానిక సమస్య లపై నిలదీశారు. ఈ దాడి ఘటనకు సంబంధించి ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. అవినీతి ఆరోపణలకు సంబంధించి స్థానిక రాజకీయ నేతలు కోర్టుకు హాజరైన సందర్భాల్లో కోర్టు ఆవరణల్లోనూ, పోలీసుస్టేషన్ల ఎదుట ప్రదర్శనలు చోటు చేసుకున్నాయి.

## విజయ్ ప్రభుత్వం మూడు నెలలు కూడా ఉండకపోవచ్చు

- తమ పార్టీల మద్దతుతోనే పాలన నడుస్తోంది
- స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు



చెన్నై: డీఎంకే అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రస్తుత తమిళనాడు ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం మూడునెలలైనా కొనసాగు తుందా అనే చర్చ ప్రజల్లో మొదలైంద న్నారు. తమ కూటమిలోని పార్టీల మద్దతుతోనే ప్రస్తుత ప్రభుత్వం నడుస్తోందని పేర్కొన్నారు. తాజాగా ఓ కార్యక్రమంలో మాట్లాడిన స్టాలిన్.. విజయ్ ప్రభు త్వం పనితీరు గురించి స్పందించారు. 'విజయ్ ప్రభుత్వ పనితీరును ఆరునెలల వరకు విమర్శించకూడదని నిర్ణయించు కున్నాం. అయితే ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు ఆ నిర్ణ యాన్ని పునఃపరిశీలించే పరిస్థితిని తీసుకొచ్చాయి. ఐదు, ఆరు నెలలు కాదు.. మూడు నెలలైనా ఈ ప్రభుత్వం నిలుస్తుందా అనే సందేహం ప్రజల్లో కనిపిస్తోంది' అని స్టాలిన్ విమర్శించారు. ఓటర్లను కలవకుండా బూత్ ఏజెంట్లను కూడా నియమించకుండా గెలిచిన పార్టీ ఎక్కువ రోజులు ఉంటుందని తాను అనుకోవ డం లేదన్నారు. తమిళనాడులో రాష్ట్రపతి పాలన విధించ డాన్ని అడ్డుకోవాలనే ఏకైక లక్ష్యంతోనే టీవీకేకు మద్దతిచ్చేందుకు తమ కూటమిలోని భాగస్వామ్య పక్షాలను అనుమతించామని స్టాలిన్ తెలిపారు. తాము అలా చేయకపోతే తమిళనాడులో బీజేపీ పాలనకు మార్గం సుగమమయ్యేదని, తమ కూటమిలోని పార్టీల మద్దతుతోనే ప్రస్తుత ప్రభుత్వం నడుస్తోందని స్టాలిన్ పేర్కొన్నారు.

## లంచగొండి ఉద్యోగి కోట్లకు పడగెత్తాడు!



భువనేశ్వర్: రూ.6,000 నెల జీతంతో సాధారణ ప్రభుత్వ ఉద్యోగిగా కెరీర్ ప్రారంభించిన ఓ ఇంజినీర్.. అవినీతికి పాల్పడి వందల రెట్లు అక్రమాస్తులు కూడబెట్టాడు. ఒడిశా రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ జరిపిన దాడుల్లో ఆ ఇంజినీర్ ఇల్లీగల్ సామ్రాజ్యం గుట్టు రట్టయింది. బ్యాంకు లాకర్లలో దాచిపెట్టిన రూ.2 కోట్ల అక్రమ నగదుతోపాటు భారీగా స్థిరాస్తులను అధికారులు గుర్తించారు. ఒడిశాలో ఈ ఏడాది జరిగిన అతిపెద్ద యాంటీ కరప్షన్ ఆపరేషన్ల స్లలో ఒకటిగా ఇది నిలిచింది. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలతో అవినీతి నిఘా నీడలోకి వచ్చిన ఈ అధికారి పేరు వైకుంఠ నాథ్ బెహెరా. ఇతను కంధమాల్ జిల్లా బలిగూడలోని ఐటీడీఏ విభాగంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అధికారిక రికార్డుల ప్రకారం. ఇతను 1999లో ఓ సాధారణ జూనియర్ ఇంజినీర్‌గా కేవలం రూ.6,000 నెల జీతంతో ప్రభుత్వ సర్వీసులో చేరాడు. వివిధ గిరిజన అభివృద్ధి సంస్థలు, ఇంజినీరింగ్ విభాగాల్లో పనిచేస్తూ.. ఈ ఏడాది ప్రారం భంలోనే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పదోన్నతి పొందాడు.

9 ప్రాంతాల్లో సోదాలు.. బయటపడిన ఆస్తులు

భువనేశ్వర్‌లోని ప్రత్యేక విజిలెన్స్ కోర్టు జారీచేసిన సెర్చ్ వారెంట్ల ఆధారంగా.. విజిలెన్స్ అధికారులు భువనేశ్వర్, బాలా సోర్, జాజ్‌పూర్, బరిపద, బలిగూడ సహా మొత్తం 9 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో బయటపడిన ఆస్తులు చూసి దర్యాప్తు అధికారులే షాకయ్యారు. బ్యాంకు లాకర్లలో నోట్ల కట్టలు: బెహెరా కుటుంబ సభ్యులకు చెందిన బ్యాంకు లాకర్లను తెరిచిన అధికారులకు నోట్ల కట్టలు దర్శనమి చ్చాయి. కేవలం లాకర్ల నుంచే దాదాపు రూ.2 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. అంతకుముందు ఇళ్లల్లో జరిపిన సోదాల్లో మరో రూ.2.66 లక్షల నగదు పట్టుబడింది. ఐదు భారీ బహుళ అంతస్తుల భవనాలు: భువనేశ్వర్‌లోని అత్యంత ఖరీదైన నీలాద్రి విహార్ ప్రాంతంలో 10,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న నాలుగంతస్తుల భవనంతోపాటు భువనేశ్వర్, జాజ్‌పూర్ జిల్లాల్లో కలిపి మొత్తం 5 బహుళ అంతస్తుల నివాస భవనాలు ఉన్నట్లు గుర్తించారు. 13 విలువైన స్థలాలు: భువనేశ్వర్ ప్రైమ్ ఏరియాల్లో ఉన్న 7 ప్లాట్లతో పాటు జాజ్‌పూర్, బరిపద ప్రాంతాలలో మొత్తం 13 హై-వాల్యూ ల్యాండ్ డాక్యుమెంట్స్ కనుగొన్నారు. బంగారం, డిపాజిట్లు: నిందితుడికి చెందిన బంగారు ఆభరణాలు, బ్యాంకు డిపాజిట్లు, పోస్టల్ సేవింగ్స్, ఇతర ఫైనాన్షియల్ ఇన్వెస్ట్‌మెంట్ల విలువను లెక్కించే ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది.

**లగ్జరీ లైఫ్.. కొనసాగుతున్న విచారణ**

చంద్రశేఖర్‌పూర్, శైలశ్రీ విహార్, కానన్ విహార్‌లోని సదరు ఇంజినీర్ నివాసాలతో పాటు బలిగూడలోని క్వార్టర్స్, ఆఫీస్ ఛాంబర్లలో ఈ తనిఖీలు జరిగాయి. ఈ భారీ ఆపరేషన్‌లో పలువు రు అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లతో కూడిన పెద్ద బృందం పాల్గొంది. స్వాధీనం చేసుకున్న లగ్జరీ ప్రాపర్టీలు, స్థలాల అసలు మార్కెట్ విలువను కచ్చితంగా అంచనా వేయడానికి విజిలెన్స్ టెక్నికల్ వింగ్ రంగంలోకి దిగింది. సోదాలు, వాల్యు యేషన్ ప్రక్రియ పూర్తిగా ముగిసిన తర్వాత ఈ అక్రమాస్తుల మొత్తం విలువపై పూర్తి స్పష్టత రానుందని, నిందితుడిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

## బెంగాల్ నుంచి ఢిల్లీ వచ్చి..
# ఆస్తి కోసమే ప్రొఫెసర్‌ను హత్య చేసిన దంపతులు





ఢిల్లీ: ఢిల్లీ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ దేవోస్మితా పాల్ హత్య కేసును పోలీసులు కేవలం మూడు రోజుల్లో ఛేదించారు. ఈ కేసులో పశ్చిమ బెంగాల్‌కు చెందిన దంపతులను అరెస్టు చేసినట్లు అధికారులు వెల్లడించారు. నిందితులు బెంగాల్‌లోని బర్ధమాన్ ప్రాంతం నుంచి సుమారు 1,400 కిలోమీటర్లు ప్రయాణించి ఢిల్లీకి వచ్చి ఈ హత్యకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. దేవోస్మితా పాల్ ఢిల్లీ యూనివర్సిటీలోని శివాజీ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. ఆమె ఢిల్లీలోని వసుంధర ఎన్‌క్లేవ్‌లో ఉన్న తన ఫ్లాట్‌లో హత్యకు గురయ్యారు. ఈ హత్య వెనుక ఆస్తి వివాదమే ప్రధాన కారణమని పోలీసులు వెల్లడించారు. దేవోస్మితా పాల్ తాతకు చెందిన ఆస్తిపై కన్నేసిన నిందితులు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దేవోస్మితా పాల్‌కు బెంగాల్‌లో వారసత్వంగా వచ్చిన ఇల్లు ఉంది. కొన్నేళ్లుగా ఆ ఇంట్లో స్థానిక దంపతులు అద్దెకు ఉంటున్నారు. కోట్ల రూపాయలు విలువ చేసే ఆ ఇంటిని స్వాధీనం చేసుకోవ డానికి అద్దెకు ఉంటున్న వారు ప్రయత్నిస్తున్నట్లు దేవోస్మిత గుర్తించారు. ఇల్లు ఖాళీ చేయాలని కొంతకాలంగా వారిపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఎలాగైనా ఆ ఇంటిని దక్కించుకోవాలనే కోరికతో ఆ దంపతులు దాదాపు 1400 కిలోమీటర్లు ప్రయాణించి ఢిల్లీకి చేరుకున్నారు. బుధవారం దేవోస్మిత ఉంటున్న అపార్ట్‌మెంట్ దగ్గరకు చేరుకున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేం దుకు తమ పాపను కూడా తీసుకెళ్లారు. దేవోస్మిత ఇంట్లోకి ప్రవేశించిన వెంటనే తమతో తెచ్చుకున్న ఆయుధంతో దాడి చేశారు. దేవోస్మితను హత్య చేసి, అరగంట పాటు అక్కడే ఉండి, బట్టలు మార్చుకుని బయటకు వచ్చి క్యాబ్‌లో వెళ్లిపోయారు. పోలీ సులు ఆ క్యాబ్ డ్రైవర్‌ను విచారించగా ఆ దంపతులు బెంగాల్ వారని తెలిసింది. దీంతో పోలీసులు నిందితులను కనిపెట్ట గలిగారు. బెంగాల్‌లోని బర్ధమాన్‌లో నిందితులను అరెస్ట్ చేశారు.

## ఎల్‌పీజీ గ్యాస్ ధరల పెంపుపై పెట్రోలియం శాఖ కీలక ప్రకటన



ఢిల్లీ: దేశంలో గృహ వినియోగ గ్యాస్ (ఎల్‌పీజీ) ధర మరోసారి రూ.29 మేర పెరిగింది. నేటి నుంచే ఈ పెంపు అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ కీలక ప్రకటన చేసింది. ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో ఇప్పటికీ ఎల్‌పీజీ ధర తక్కువేనని పేర్కొంది. ఈ సిలిండర్‌ను సప్లై చేసేందుకు ప్రస్తుతం రూ.1600 లకు పైనే ఖర్చవుతోందని వెల్లడించింది. అయితే, ఢిల్లీలోని ఒక సాధారణ కస్టమర్ ఒక సిలిండర్ కోసం రూ.942 చెల్లిస్తుంటారని చెప్పింది. భారత్‌లోని ధరలు అంతర్జాతీయ మార్కెట్ ధరలతో ముడి పడి ఉంటాయని కూడా పెట్రోలియం మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితే, ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వం ధరల్లో మార్పులు చేస్తుంటుందని వెల్లడించింది. ప్రభుత్వం ఒక్కో సిలిం డర్‌పై వందల రూపాయాల భారం సామాన్యులపై పడకుండా స్వయంగా మోస్తోందని తెలిపింది. కమర్షియల్ సిలిండర్ ధరలను మాత్రం నెలనెలా సవరిస్తూనే ఉంటామని తెలిపింది. ఇది అంతర్జాతీయ మార్కెట్ ధరలను ప్రతిఫలిస్తుందని చెప్పింది. భారత్ ఎల్‌పీజీ అవసరాల్లో 60 శాతం దిగుమతుల ద్వారా తీరుతోంది. భారత్‌లో ధరలు.. సౌదీ ఆయిల్ సంస్థ అరామ్కో నిర్ణయించే సౌదీ కాంట్రాక్ట్ ధరపై ఆధారపడి ఉంటాయి. సౌదీ సంస్థ ఈ ధరను ప్రతి నెలా మొదట్లో సవరిస్తుంటుంది. భారత్ వినియోగించే ఎల్‌పీజీ (ప్రొపేన్, బ్యూటేన్ వాయువుల 50:50 మిశ్రమం) కాంట్రాక్ట్ ధర పశ్చిమాసియా ఉద్రిక్తతల ముందు టన్నుకు 542 డాలర్లుగా ఉండేది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, ప్రస్తుతం ఈ ధర 790 డాలర్లకు చేరింది.

# మోదీ ఇచ్చిన వజ్రాన్ని కొనాలనుకున్నా

***- ఆత్మకథలో భారత బహుమతిని ప్రస్తావించిన జిల్ బైడెన్***




జో బైడెన్ అధికారంలో ఉన్న సమయంలో ప్రధాని మోదీ బహూకరించిన 7.5 క్యారెట్ల సింథటిక్ వజ్రాన్ని అమెరికా మాజీ ప్రథమ మహిళ జిల్ బైడెన్ గుర్తు చేసుకున్నారు. మోదీ బహుమతిగా ఇచ్చిన వజ్రాన్ని తనవద్దే ఉంచుకోవాలని తొలుత అనుకున్నానని.. కానీ, అమెరికా అధికారులు దానికి ఎక్కువ విలువ కట్టడంతో ఆ డైమండ్‌ను ఫెడరల్ ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేసినట్టు 'వ్యూ ఫ్రమ్ ది ఈస్ట్ వింగ్: ఎ మెమోయిర్' అనే తన ఆత్మకథలో రాసుకొచ్చారు. ఈ పుస్తకంలో వైట్ హౌస్‌లోని తెరవెనుక జీవితం గురించి.. అధ్యక్షుడి కుటుంబం అందుకునే బహుమతులకు ఉన్న నిబంధనల గురించి జిల్ బైడెన్ వివరించారు.

2023 జూన్‌లో అమెరికా అధ్యక్ష భవనం ఇచ్చిన అధికారిక విందులో మోదీ అతిథిగా పాల్గొన్నారు. ఆ సమయంలో ఆయన బహూకరించిన వజ్రం తనను ఎంతో ఆకర్షించిందని.. చాలా అద్భుతంగా ఉందని జిల్ బైడెన్ పేర్కొన్నారు. అయితే బైడెన్ పదవినుంచి తప్పుకున్న తర్వాత అమెరికా నియమాల ప్రకారం.. ఆ బహుమతిని తిరిగి ప్రభుత్వానికి ఇచ్చేయాల్సి వచ్చిందని తెలిపారు. దానికి అప్పట్లో ఉన్న మార్కెట్ విలువను చెల్లించి కొనుగోలు చేయడానికి అధికారులు అనుమతిస్తారన్నారు. దీంతో ఆ డైమండ్‌ను కొనుగోలు చేయాలని తాను అనుకున్నట్టు తెలిపారు.

విదేశాంగ శాఖ వజ్రం విలువను 20 వేల డాలర్లుగా అంచనా వేయడంతో దానిని కొనుగోలు చేయలేదని పేర్కొన్నారు. అందుకు బదులుగా ఆ వజ్రాన్ని అరువుగా తీసుకుని అధికారిక కార్యక్రమాల్లో ధరించడానికి అధికారులు తనకు అనుమతి ఇచ్చారన్నారు. దీంతో ఆ డైమండ్‌ను ఓ ఉంగానికి పొదిగించి ధరించినట్టు తెలిపారు. ఫ్రాన్స్ ప్రథమ మహిళ బ్రిగిట్టే మెక్రాన్ తనకు ఇచ్చిన బ్రాస్లెట్‌ను అమెరికా ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసినట్టు తెలిపారు. కాగా 2023లో జిల్ బైడెన్‌కు ప్రపంచ దేశాధినేతలనుంచి అందిన బహుమతుల్లో అతి ఖరీదైనది మోదీ బహూకరించిన వజ్రమేనని అప్పట్లో అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించింది.

# ట్రంప్ టీంనుంచి కృష్ణన్ బై బై



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సీనియర్ సలహాదారుగా పనిచేసిన భారత సంతతికి చెందిన శ్రీరామ్ కృష్ణన్ తన పదవికి రాజీనామా చేయనున్నారు. ఈ నెలాఖరులో టెక్నాలజీ సలహాదారు పదవినుంచి దిగిపోనున్నట్టు ట్రంప్ అడ్మినిస్ట్రేషన్‌లో అమెరికా ఏఐ విధానాలను రూపొందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ట్రంప్‌తో కలిసి పని చేయడం తనకు లభించిన గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఏఐ పోటీని తట్టుకొని దేశం మరింత ముందుకు వెళ్లడానికి అధ్యక్షుడు కీలక చర్యలు తీసుకున్నారని ప్రశంసించారు. ఆయన నాయకత్వం లేకుండా అమెరికా ఏఐ రేసులో ముందంజలో ఉండేది కాదన్నారు. తాను అధికారం చేపట్టిన నాటినుంచి నేటి వరకు అమెరికా అభివృద్ధి కోసం పని చేశానని శ్రీరామ్ కృష్ణన్ అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సలహాదారుగా తాను అమెరికన్ ఏఐ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించి, ప్రచురించడంలో సహాయపడ్డానని వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోసం నేషనల్ ఏఐ పాలసీ ఫ్రేమ్ వర్క్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్‌పై పనిచేసినట్టు తెలిపారు. ఫ్రాన్స్, భారత్‌వంటి దేశాలలో జరిగిన అంతర్జాతీయ ఫోరంలు, సదస్సులలో అమెరికన్ ఏఐ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించానని పేర్కొన్నారు. కొంత విరామం తర్వాత ఏఐ విషయంలో అగ్రరాజ్యం ఎదుర్కొంటున్న భారీ సవాళ్లను అధిగమించడానికి సాయం చేస్తానని తెలిపారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక అమెరికా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సలహాదారుగా శ్రీరామ్ కృష్ణన్‌ను నియమించారు. అంతకుముందు వెంచర్ క్యాపిటలిస్టుగా వ్యవహరించిన ఆయన.. అమెరికాలో కృత్రిమ మేధస్సు విధానాలు, జాతీయ ఫ్రేమ్‌వర్క్ రూపకల్పనలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. గతంలో మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్ ఎక్స్ వంటి టెక్ సంస్థల్లో కీలక స్థానాల్లో పనిచేశారు.

# పర్వతాల పొట్టలో పరుగు!



శతాబ్దాలపాటు ప్రయాణికులకు అడ్డుగా నిలిచిన ఆల్ప్స్ పర్వతాలు ఇప్పుడు ఓ కొత్త పరిణామానికి వేదికవుతున్నాయి. ఇంజినీర్లు, యంత్రాలు.. రాత్రీపగలూ తేడా లేకుండా పర్వతాల పొట్ట తొలిచేస్తున్నారు. సముద్రపు అడుగున సొరంగాలు నిర్మిస్తున్నారు. ఒకప్పుడు వేర్వేరు ప్రపంచాల్లా ఉన్న దేశాలు, నగరాలు త్వరలో రైలు మార్గాల ద్వారా గంటల్లో అనుసంధానమవుతాయి. ఇది ఐరోపా చరిత్రలోనే అతిపెద్ద రవాణా విప్లవం!

**ఒక మహా సంకల్పం**

ఈ మొత్తం కార్యక్రమానికి వెన్నెముక ట్రాన్స్-యూరోపియన్ ట్రాన్స్‌పోర్ట్ నెట్‌వర్క్. సంక్షిప్తంగా టీఈఎన్-టీ. ఐరోపావ్యాప్తంగా 10,850 మైళ్ల రైలు మార్గాలను నవీకరించడం ప్రాజెక్టు లక్ష్యం. కోర్ నెట్‌వర్క్ 2030నాటికి పూర్తికావాలని, సమగ్ర నెట్‌వర్క్ 2050నాటికి సిద్ధమవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రైల్ బాల్టికా, బ్రెన్నర్ బేస్ టన్నెల్, లిస్బన్-మాడ్రిడ్ హైస్పీడ్ లైన్ వంటి మెగా ప్రాజెక్టులు ఈ నెట్‌వర్క్‌లో కీలకం.

2030నాటికి కోర్ నెట్‌వర్క్‌ను పూర్తిగా విద్యుద్దీకరించాలని, 2040నాటికి సరుకు రవాణా రైళ్లు గంటకు కనీసం 100 కి.మీ., ప్రయాణికుల రైళ్లు గంటకు కనీసం 160 కి.మీ. వేగంతో పరుగెత్తాలని నిర్దేశించారు. అంతర్జాతీయ సరిహద్దు దాటడానికి సగటున 25 నిమిషాలకంటే తక్కువ సమయం పట్టాలన్నది ప్రాజెక్టు మరో ముఖ్యమైన లక్ష్యం.

**గొథార్డ్ బేస్ టన్నెల్ -ఆరంభమైన విప్లవం**

స్విట్జర్లాండ్‌లో 2016లో ప్రారంభమైన గొథార్డ్ బేస్ టన్నెల్ ఈ రంగంలో మార్గదర్శిగా నిలుస్తోంది.



ఇది ప్రపంచంలోనే అతిపొడవైన రైలు సొరంగం. జ్యూరిక్ -మిలన్ మధ్య ప్రయాణ సమయాన్ని నాలుగు గంటలనుంచి రెండున్నర గంటలకు తగ్గించింది. పాత గొథార్డ్ మార్గంకంటే ఇది 25 మైళ్లు తక్కువ దూరం, పైగా పర్వతాల్ని చాలా తక్కువ ఎత్తులో దాటుతుంది. 57 కి.మీ. పొడవైన ఈ రెట్టింపు సొరంగం గరిష్ఠంగా 2,300 మీటర్ల లోతులో ఉంది. అంటే ఆల్పైన్ శిఖరాలకంటే దాదాపు 7,500 అడుగుల కింద! ఈ 11.3 బిలియన్ డాలర్ల ప్రాజెక్టు ప్రతి అంశమూ ఇంజినీరింగ్ చరిత్రకు అద్భుతమైన ఉదాహరణ.

**బ్రెన్నర్ బేస్ టన్నెల్ -రికార్డుల సొరంగం**

ఇప్పుడు నిర్మాణంలో ఉన్న సొరంగాల్లో అత్యంత మహత్తరమైనది బ్రెన్నర్ బేస్ టన్నెల్. ఇది ఆస్ట్రియాలోని ఇన్స్‌బ్రూక్‌ను ఇటలీలోని ఫ్రాంజెన్ఫెస్టే/ఫోర్టెజ్జాతో అనుసంధానిస్తుంది. మొత్తం 64 కి.మీ. (40మైళ్లు) పొడవుతో 2032లో తెరుచుకున్న తర్వాత ఇది ప్రపంచంలోనే అతిపొడవైన భూగర్భ రైలు మార్గంగా రికార్డు సాధిస్తుంది. దీని నిర్మాణ వ్యయం 8.54 బిలియన్ యూరోలు. బ్రెన్నర్ పాస్ ఐరోపాలో అత్యంత రద్దీగా ఉండే పర్వత రహదారి. ప్రతి ఏడాది ఇక్కడ 25 లక్షలకుపైగా లారీలు, 1.4 కోట్ల వాహనాలు, 5 కోట్ల టన్నుల సరకు రవాణా జరుగుతుంది. 1860లో నిర్మించిన పాత రైలు మార్గం వంకరటింకరగా పర్వతాలపై సాగుతుంది. 26 శాతం వరకు నిటారుగా ఉంటుంది. దీనివల్ల ఇటలీవైపు రెండు, ఆస్ట్రియావైపు మూడు లోకోమోటివ్‌లు అవసరమవుతాయి. కొత్త బ్రెన్నర్ సొరంగం ద్వారా ఇన్స్‌బ్రూక్ నుంచి బోల్జానో వరకు ప్రయాణ సమయం రెండు గంటలనుంచి కేవలం 50 నిమిషాలకు తగ్గుతుంది. గత సెప్టెంబరులో ఈ ప్రాజెక్టులో కీలక మైలురాయి చేరుకుంది. 57.5 కి.మీ. పొడవైన అన్వేషణ సొరంగం పూర్తిగా తవ్వబడింది. ఇటలీ, ఆస్ట్రియా ప్రధాన మంత్రులు, యూరోపియన్ యూనియన్ అధికారులతో సహా దాదాపు వెయ్యిమంది అతిథులు ఈ సందర్భాన్ని జరుపుకున్నారు. ఈ అన్వేషణ సొరంగం భూగర్భ శాస్త్ర సమాచారాన్ని సేకరించడం, అత్యవసర నిర్గమన మార్గంగా పనిచేస్తుంది.

**ఆస్ట్రియా, ఫ్రాన్స్-ఇటలీ.. మరిన్ని మెగా ప్రాజెక్టులు**

ఆస్ట్రియాలో 17 మైళ్ల పొడవైన సెమ్మెరింగ్ బేస్ టన్నెల్ 2030లో పూర్తికానుంది. ఇది 5 బిలియన్ డాలర్ల వ్యయంతో విన్నానుంచి గ్రాజ్, విల్లాఖ్ నగరాలకు, అక్కడనుంచి ఇటలీ, స్లొవేనియా, అడ్రియాటిక్ తీరానికి వేగవంతమైన సంధానం ఏర్పరుస్తుంది. 2025 డిసెంబరులో ప్రారంభమైన గ్రాజ్-విల్లాఖ్ మధ్య 81 మైళ్ల కొరాల్మ్ రైల్వే అందులో భాగమే. ఇందులో ఆస్ట్రియాలోనే అత్యంత పొడవైన 20.4 మైళ్ల సొరంగం ఉంది. ఫ్రాన్స్-ఇటలీ సరిహద్దులో మాంట్ సెనిస్ టన్నెల్ లియాన్-టురిన్ మార్గంలో ప్రయాణాన్ని పూర్తిగా మార్చేయనుంది.

**సముద్రం అడుగున సొరంగాలు -డెన్మార్క్ ధైర్యసాహసాలు**

కేవలం పర్వతాలే కాదు, సముద్రమూ ఐరోపా రైలు నెట్‌వర్క్‌కు అడ్డుగా నిలవడం లేదు. చాలాకాలంగా సముద్ర రవాణాపై ఆధారపడిన డెన్మార్క్ ఇప్పుడు తన రైలు రవాణా వ్యవస్థను విప్లవాత్మకంగా మారుస్తోంది. 2030 ప్రారంభంలో బాల్టిక్ సముద్రం అడుగున రోడ్డు-రైలు లింక్ పూర్తవుతుంది. దీనివల్ల కోపెన్హాగన్, హాంబర్గ్, బెర్లిన్ మధ్య ప్రయాణ సమయాలు గణనీయంగా తగ్గుతాయి. ఫిన్లాండ్ గల్ఫ్ కింద 50 మైళ్ల సొరంగం ద్వారా హెల్సింకీని ఎస్తోనియా రాజధాని టలిన్‌తో, అక్కడినుంచి బాల్టిక్ దేశాలతో కలిపే మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టూ ప్రతిపాదన దశలో ఉంది.

**సవాళ్లు తక్కువేం కాదు**

ఈ మెగా ప్రాజెక్టులన్నీ ఆశావహంగా కనిపించినా, అమలులో విపరీతమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ప్రాజెక్టులన్నీ నిర్ణీత గడువుకంటే ఆలస్యంగా పూర్తవుతున్నాయి. నిర్మాణ వ్యయాలు అంచనాలను దాటిపోతున్నాయి. మొత్తం 8 ప్రధాన ప్రాజెక్టుల్లో ఖర్చులు అంచనాలకంటే సగటున 82 శాతం పెరిగాయి. 5 ప్రాజెక్టులలో సగటు ఆలస్యం 17 సంవత్సరాలకు చేరింది. రాజకీయ అభ్యంతరాలు, పర్యావరణ ఆందోళనలు, ప్రభావిత గ్రామాల వ్యతిరేకత.. ఇవన్నీ నిర్మాణ పనుల్ని నెమ్మదిస్తున్నాయి. అయినా ఐరోపా వెనుతిరగడం లేదు. ఈ బ్రెన్నర్ బేస్ టన్నెల్ మ్యూనిచ్-వెరోనా అక్షంలో రహదారి రవాణానుంచి కోట్లాది టన్నుల సరుకును రైలుకు మళ్ళించి, సున్నితమైన ఆల్పైన్ ప్రాంతాల్లో కాలుష్యాన్ని, రద్దీని తగ్గించే లక్ష్యంతో నిర్మిస్తున్నారు. ఇది కేవలం రవాణా సంస్కరణ మాత్రమే కాదు -పర్యావరణ సంరక్షణకు కూడా ఒక మెట్టు.

**చరిత్ర పుటలు మారుతున్నాయి**



శతాబ్దాల క్రితం రోమన్లు బ్రెన్నర్ మార్గం గుండా యుద్ధాలకు వెళ్లారు. మధ్యయుగంలో వర్తకులు పల్లకీల్లో ఆల్పైన్ కనుమలు దాటారు. 1921లో సింప్లాన్ సొరంగం వెలిసింది. 2016లో గొథార్డ్ రికార్డు సాధించింది. ఇప్పుడు 2032 నాటికి బ్రెన్నర్ ఆ రికార్డును అధిగమించనుంది. సముద్రాలు, పర్వతాలు మానవ సంకల్పానికి అడ్డుకాలేవని ఐరోపా మరోసారి నిరూపిస్తోంది. రేపటి ఐరోపా పర్యాటకుడు ఉదయం విన్నాలో అల్పాహారం తీసుకుని, మధ్యాహ్నానికి మిలన్‌లో లంచ్ చేసి, సాయంత్రానికి బెర్లిన్‌లో డిన్నర్ ముగించవచ్చు. భూగర్భం గుండా పరుగెత్తే రైళ్లు.. దూరాన్ని చరిత్రగా మారుస్తున్నాయి!

**- చైతన్యరథం డెస్క్**

# భారత్ భారీ స్కోరు..


## - ఫాలోఆన్ దిశగా ఆఫ్గానిస్థాన్



ముల్లాన్‌పూర్ వేదికగా అఫ్గానిస్థాన్-భారత్ ఏకైక టెస్టులో తలపడుతున్నాయి. రెండో రోజు ఆట ముగిసే సమయానికి అఫ్గానిస్థాన్ 39.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 113 పరుగులు చేసింది. భారత్‌పై అఫ్గాన్ ఇంకా 451 పరుగుల వెనుకంజలో ఉంది. క్రీజులో రెహమత్ షా(43) ఉన్నాడు. భారత బౌలర్లలో యువ స్పిన్నర్ మానవ్ సుతార్ 3 వికెట్లతో చెలరేగాడు. ప్రసిద్ధ్ కృష్ణ 2 వికెట్లు పడగొట్టాడు. అంతకు ముందు ఓవర్‌నైట్ 368/3 స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన భారత్.. 564 పరుగుల స్కోర్ చేసింది.

127 ఓవర్లలో 8 వికెట్లు కోల్పో యి 564 పరుగులు చేసి డిక్లేర్ ప్రకటించింది. కేఎల్ రాహుల్(100), శుభ్‌మన్ గిల్(126) సెంచరీలతో చెలరేగారు. సాయి సుదర్శన్ (81), రిషభ్ పంత్ (81), వాషింగ్టన్ సుందర్(52) హాఫ్ సెంచరీలు చేశారు. అఫ్గాన్ బౌలర్లలో సలీమ్ సాఫి 6 వికెట్లతో విజృంభించాడు. రెహమాన్ షరీఫీ, హష్మతుల్లా షాహిది తలొక వికెట్ పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్థాన్ బ్యాటర్లు తడబడ్డారు. అబ్దుల్ మాలిక్(16), సెదికుల్లా అటల్ (17), రెహమానుల్లా గుర్బాజ్(12), హష్మతుల్లా షాహిది(20), అఫ్సర్ జాజై(3) వెనువెంటనే పెవిలియన్ బాట పట్టారు.

# పంత్ షాట్‌కు కిందపడిన డ్రోన్



ముల్లాన్‌పూర్ వేదికగా అఫ్గానిస్థాన్, భారత్ మధ్య ఏకైక టెస్టు మ్యాచ్ జరుగుతుంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి అఫ్గానిస్థాన్ 113/5 స్కోర్ చేసింది. అంతకు ముందు టీమిండి యా 564/8 వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. కేఎల్ రాహుల్(100), శుభ్‌మన్ గిల్(126) సెంచరీలతో చెలరేగారు. రిషభ్ పంత్(81) త్రుటిలో సెంచరీ అవకాశాన్ని మిస్ చేసుకున్నాడు. అయితే పంత్‌కు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పంత్ అనగానే.. బ్యాట్‌తో అతడు చేసే విన్యాసాలే గుర్తొస్తాయి. అయితే తొలి రోజు ఆటలో భాగంగా 28 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద పంత్ కొట్టిన బంతి డ్రోన్ తాకి, అది కింద పడిపోయింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే ఈ వీడియో నిజమేనా? లేకా ఏఐతో చేశారా? అనే చర్చ మొదలైంది. 'ఇది నిజం కాదు.. ఫేక్ వీడియో. ఎలా అంటే.. బంతి గమనంలో తేడా ఉంది. అలాగే టెస్టు క్రికెట్‌లో వాడేది రెడ్ బాల్. కానీ ఈ వీడియోలో మాత్రం వైట్ బాల్ కనిపిస్తోంది. ఈ వీడియోను కాస్త పరిశీలనగా చూస్తూ ఇది ఏఐతో తయారు చేసిందని అర్థమవుతోంది' అంటూ అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. 'కొందరు ఏఐతో ఇలాంటి నకిలీ కంటెంట్‌ను క్రియేట్ చేసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్నారు. ఏది నిజమో.. ఏది అబద్ధమూ.. తెలుసుకోవడం కష్టంగా మారింది' అని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. 'పంత్‌కు ఇవన్నీ మామూలే.. కొట్టినా కొట్టేయొచ్చు' అని పలువురు సరదాగా కామెంట్లు పెడుతున్నారు. నెట్టింట్ వైరల్ అవుతున్న ఆ వీడియో ఏఐయేనా? నిజంగా జరిగిందా? అనేది స్పష్టంగా

# విరాట్ భయ్యా

## పెద్దన్నయ్యలా సలహాలు ఇచ్చాడు

- వైభవ్ సూర్యవంశీ



ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్ ముగిసిన తర్వాత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీతో టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ కాసేపు ముచ్చటించిన సంగతి తెలిసిందే. దానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. అయితే అప్పుడు కోహ్లీ తనతో మాట్లాడిన విషయాల గురించి వైభవ్ తాజాగా గుర్తు చేసుకున్నాడు. విరాట్ తనతో మాట్లాడిన క్షణాలు ఇప్పటికీ కలలాగా అనిస్తాయని వెల్లడించాడు. 'నిజం చెప్పాలంటే నేను చిన్నప్పటి నుంచి ఆర్సీబీకి అభిమానిని. అంతకంటే ఎక్కువగా విరాట్ కోహ్లీకి వీరాభిమానిని. అలాంటి కోహ్లీ భయ్యా నా భుజంపై చేయి వేసి మాట్లాడినప్పుడు అది కలలా అనిపించింది. ఆయన మాట్లాడిన తీరు చూస్తే.. ప్రపంచ క్రికెట్ దిగ్గజం ఒకరు నాతో మాట్లాడుతున్నట్లు అస్సలు అనిపించలేదు. నాకు ఒక పెద్దన్నయ్యలా సలహాలు ఇచ్చాడు. నాకు క్రికెట్‌కు సంబంధించి పలు విలువైన సూచనలు చేశాడు. నేను ఇంకా ఏ అంశాల్లో మెరుగుపడాలి.. భవిష్యత్తులో దేనికి ప్రాధాన్యం ఇవ్వాలి.. లక్ష్యాలను ఎలా నిర్దేశించుకోవాలి.. వంటి విషయాలను చెప్పాడు. ఆయన మాటలు నాకు ఎంతో ప్రేరణనిచ్చాయి' అని వైభవ్ వెల్లడించాడు. వైభవ్ క్యాప్‌పై కోహ్లీ ఆటోగ్రాఫ్ చేసిన సంగతి తెలిసిందే. దానిపై కూడా వైభవ్ స్పందించాడు. 'ఆ క్యాప్‌ను నేను చాలాసార్లు ధరించాను. ఆరెంజ్ క్యాప్ నా దగ్గర లేని సమయాల్లో ఎక్కువగా కోహ్లీ భయ్యా ఆటోగ్రాఫ్ చేసిన టోపీనే పెట్టుకునే వాడిని' అని వైభవ్ చెప్పుకొచ్చాడు. ఐపీఎల్ 2026లో వైభవ్ సూర్యవంశీ, విరాట్ కోహ్లీ ఇద్దరూ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. వైభవ్ 16 మ్యాచ్‌ల్లో 776 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్‌తో పాటు అత్యంత విలువైన ఆటగాడు (ఎంవీపీ) అవార్డును సొంతం చేసుకున్నాడు. మరోవైపు కోహ్లీ 675 పరుగులతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును వరుసగా రెండోసారి ఛాంపియన్‌గా నిలపడంలో కీలక పాత్ర పోషించాడు.

# మరో మూడురోజుల్లో సాకర్ కిక్




మెస్సీ, రొనాల్డో, నెయ్‌మార్, ఎంబాపెలాంటి యోధాను యోధులు... మైదానంలో పాదరసంలా కదలాడుతూ మైమర పింపజేసే విన్యాసాలు... కురుక్షేత్రాన్ని తలపించే మైదానాలు... స్టార్ల నామస్మరణతో దద్దరిల్లిపోయే స్టేడియాలు... యావత్ ప్రపం చాన్ని టీవీల ముందు అతుక్కుపోయేలా చేసే ఉత్కంఠభరిత దృశ్యా లు... సుమారు నలభైరోజులపాటు విశ్వ క్రీడాజగత్తు కళ్లన్నీ ఆ బంతివైపే! ఇప్పుడందరినోటా ఒకే మాట... సాకర్... సాకర్... సాకర్! నాలుగేళ్లకోసారి ఫుట్‌బాల్ ప్రేమికులను ఉర్రూతలూగించే 'ఫిఫా' ప్రపంచకప్ వచ్చేసిందోచ్...యావత్ ప్రపంచం ఆసక్తిగా వీక్షించే అత్యద్భుత ఘట్టానికి కౌంట్‌డౌన్ మొదలయ్యింది. 39 రోజుల పాటు క్రీడాలోకం సాకర్ ఫీవర్‌తో హీటెక్కనుంది. అందరికీ ఇష్టమైన ఫుట్‌బాల్ పండగ, ఫిఫా ప్రపంచకప్ జూన్ 11 నుంచి జూలై 19 వరకు జరగనుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా మూడు దేశాల్లో మ్యాచ్‌లు నిర్వహించడం.. జట్లతో పాటు మ్యాచ్‌ల సంఖ్య పెరగడం.. మెస్సీ, రొనాల్డోలాంటి స్టార్లకు ఆఖరి కప్ కానుండడం..ఇలా ఈ23వ ప్రపంచకప్‌నకు విశేషాలు ఎన్నోఉన్నాయి. ప్రతీ నాలుగేళ్లకోసారి వచ్చే ఫిఫా ప్రపంచకప్ మొట్టమొదటిసారిగా 1930లో మొదలైంది. రెండో ప్రపంచ యుద్ధం కారణంగా 1942, 1946 సంవత్సరాల్లో టోర్నీ జరగ లేదు. అనంతరం జర్నీ సాఫీగా సాగింది. ప్రతీసారి అమితమైన ఆదరణను పెంచుకుంటూ ముందుకు సాగుతోంది.

**ఈసారి 'వెరీ వెరీ స్పెషల్'..**

ఈ ఏడాది ప్రపంచకప్ ఎంతో ప్రత్యేకం. 2022లో గల్ఫ్ దేశం కతార్‌లో జరిగిన టోర్నీలో 32 జట్లు పోటీపడ్డాయి. ఆటను మరిం త విశ్వవ్యాప్తం చేయడం కోసం ఈసారి జట్ల సంఖ్యను 48కి పెంచారు. దీంతో టోర్నీలో రికార్డుస్థాయిలో 104 మ్యాచ్‌లు జరగనున్నాయి. నాకౌట్ దశకు అదనంగా రౌండాఫ్ 32ను జోడించారు. 48 జట్లు 12 గ్రూపులుగా విడిపోయి తలపడతాయి. గ్రూప్ దశలో 72 మ్యాచ్‌లు జరుగుతాయి. 32 నాకౌట్ మ్యాచ్ లుంటాయి. ప్రతీ గ్రూప్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లతో (24) పాటు అన్ని గ్రూపుల నుంచి మూడో స్థానంలోని 8 అత్యుత్తమ జట్లు నాకౌట్ దశకు అర్హత సాధిస్తాయి. నాకౌట్‌లో రౌండాఫ్ 32, ప్రీక్వార్టర్స్, క్వార్టర్స్, సెమీస్, ఫైనల్స్ ఉంటాయి.

**అబ్బురం.. మూడు దేశాల ఆతిథ్యం**

ఈ ప్రపంచకప్‌నకు మూడు దేశాలు ఆతిథ్యమిస్తుండటం అబ్బురపరిచే విషయం. అమెరికా, మెక్సికో, కెనడా దేశాల్లో టోర్నీ జరగనుంది. ఇలా రెండు కన్నా ఎక్కువ దేశాలు కలిసి ప్రపంచకప్ నిర్వహించడం ఇదే తొలిసారి. గతంలో రెండుసార్లు (1970, 1986) నిర్వహించిన మెక్సికో మూడో పర్యాయం నిర్వహిస్తూ... అత్యధికసార్లు ఫిఫా కప్‌నకు ఆతిథ్యమిచ్చిన దేశంగా ఘనత వహిస్తోంది. 1994లో ప్రపంచకప్‌నకు వేదికగా నిలిచిన అమెరికాకు ఇది రెండో ఆతిథ్యం. కెనడాకు మొదటిసారి. జూన్ 11న మెక్సికో సిటీ స్టేడియంలో మెక్సికో, దక్షిణాఫ్రికా మధ్య మ్యాచ్‌తో మొదలై.. జూలై 19న అమెరికాలోని ది మెట్‌లైఫ్ స్టేడియం (న్యూయార్క్ న్యూజెర్సీ స్టేడియం)లో జరిగే ఫైనల్ పోరుతో టోర్నీ



ముగుస్తుంది. మెస్సీ సారథ్యంలోని డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా తన తొలి మ్యాచ్‌ను జూన్ 16న అల్జీరి యాతో ఆడనుంది. క్వార్టర్‌ఫైనల్స్ నుంచి మ్యాచ్‌లన్నీ అమెరికా స్టేడియాల్లోనే నిర్వహిస్తున్నారు. బెర్ముడా, కెంచుకీ, బ్లూ గడ్డితో మైదానాలను తయారు చేస్తున్నారు. ఫైనల్ సహా 8 మ్యాచ్‌లకు ఆతిథ్యమిస్తున్న మెట్‌లైఫ్ స్టేడియంలో సాధారణంగా రగ్బీ మ్యాచ్ లు జరుగుతుంటాయి. కానీ, ఫిఫా టోర్నీకి అనుగుణంగా ఈసారి స్టేడియాన్ని ముస్తాబు చేశారు. మ్యాచ్‌లో కార్నర్ కిక్‌లను దృష్టిలో ఉంచుకొని స్టేడియంలోని కార్నర్లలో 1700కు పైగా సీట్లను తొలగించారు.

**టాప్‌లో బ్రెజిల్...**

ఇప్పటిదాకా 22 సాకర్ ప్రపంచకప్‌లు జరిగితే కప్పును అందుకునే అదృష్టం 8 దేశాలకు మాత్రమే దక్కింది. ఇందులో అత్యధికంగా ఐదుసార్లు బ్రెజిల్ చాంపియన్‌గా నిలిచి టాప్‌లో ఉంది. జర్మనీ, ఇటలీ నాలుగేసి సార్లు.. అర్జెంటీనా మూడుసార్లు, ఫ్రాన్స్, ఉరుగ్వే రెండేసి సార్లు విశ్వవిజేతలుగా నిలిచాయి. ఇంగ్లండ్, స్పెయిన్ ఒక్కోసారి ట్రోఫీని ముద్దాడాయి.

చైతన్య రథం
సినిమా
సోమవారం 8 జూన్ 2026 X


# నాని.. లెక్క తప్పాడా?




నాచురల్ స్టార్ నాని అంటే మినిమమ్ గ్యారెంటీ హీరో అనే మార్క్ టాలీవుడ్‌లో ఉంది. ఆన్ టైం సినిమాలు కంప్లీట్ చేస్తూ ప్రొడ్యూసర్ హీరోగా నానికి పేరుంది. అందుకుతగ్గట్టుగానే తన సినిమాలు పక్కాగా ప్లాన్ చేసుకుంటూ ఉంటాడు. అలానే గత సినిమా సరిపోదా శనివారం వరకు నాని వెనక్కి తిరిగి చూడకుండా తనకంటూ స్పెషల్ ఫ్లాట్‌ఫాంను టాలీవుడ్‌లో స్థాపించుకున్నాడు. అయితే దానిని మరోస్థాయికి భారీ చిత్రం 'ది ప్యారడైజ్' తీసుకెళ్లే ప్రయత్నం మాత్రం ఎందుకో ఇపుడు అంత అనుకున్న రేంజ్‌లో వెళ్లట్లేదా అనిపిస్తుంది. ఈ సినిమా పరంగా మాత్రం నాచురల్ స్టార్ లెక్క తప్పిందా? అనే మాట వినిపిస్తుంది. ప్రతీ సినిమాకి పక్కాగా ఆన్ టైం విడుదల చేసిన నాని ఈ సినిమా మాత్రం అనుకున్న టైంని దాటాల్సి వచ్చింది. ఆల్రెడీ మార్చ్‌లో రావాల్సిన ప్యారడైజ్ సినిమా ఆగస్టుకి వాయిదా పడింది. కానీ ఇప్పుడు ఇదే ఆగస్టు 21 డేట్‌లో మాస్ మహారాజ రవితేజ చిత్రం 'ఇరుముడి' లాక్ అవ్వడంతో ప్యారడైజ్ మళ్లీ వాయిదా అనే మాట మొదలైంది. దీనితో ఈసారి పక్కాగా నాని లెక్క మాత్రం తప్పిందనే అనుకోవాలి. సో దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దీనిపై ఏమన్నా క్లారిటీ ఇస్తాడేమో చూడాలి.

# క్లైమాక్స్‌పై క్రేజీ అప్‌డేట్




అక్కినేని అఖిల్ ప్రస్తుతం లెనిన్ చిత్రాన్ని దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరి (నందు) డైరెక్షన్‌లో చేస్తున్నాడు. ఈ సినిమా జూన్ 26న రిలీజ్ కానుంది. అఖిల్ హోప్స్ అన్నీ ఈ సినిమాపైనే ఉన్నాయి. అందుకే, ప్రమోషన్స్‌ను కూడా బలంగా చేయడానికి టీమ్ ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే, ఈ సినిమా ఫస్ట్ కాపీ బిఫోర్ వెర్షన్‌ను నాగార్జునతో పాటు టీమ్ మెంబర్స్ కూడా చూశారు. అఖిల్ కెరీర్‌కి కచ్చితంగా సినిమా హెల్ప్ అవుతుందని.. ముఖ్యంగా సరికొత్త అఖిల్ సినిమాలో కనిపించబోతున్నాడని తెలుస్తోంది. ప్రధానంగా సినిమాలో క్లైమాక్స్ అదిరిపోయిందని.. క్లైమాక్స్‌లో అఖిల్ నటన అద్భుతంగా ఉందని అంటున్నారు. కాగా ఈ సినిమా.. రాయలసీమ బ్యాక్ డ్రాప్‌తో చిత్తూరు ప్రాంతం నేపథ్యంలో తెరకెక్కుతుంది. ఇక ఈ సినిమాలో అందాల భామ భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక సినిమాపై భారీ అంచనాలున్నాయి. ముఖ్యంగా అఖిల్ –భాగ్యశ్రీ లవ్ సీన్స్ బాగుంటాయట. సినిమా అవుట్ పుట్ బాగా వచ్చిందని టీమ్ చెబుతున్న నేపథ్యంలో.. ఈ సినిమాతో అఖిల్ హిట్ కొడతాడో లేదో చూడాలి!



# గ్లామర్ పంజరంలో చిక్కుకుని..

తాజాగా డింపుల్ హయతి వేదన కూడా ఇదే. తెలుగు సినీ పరిశ్రమలో తెలుగు హీరోయిన్లకు అవకాశాలు చాలా తక్కువగా ఉంటున్నాయని, ఉన్నవారికి కూడా నటనా పరిధి అరకొరగానే ఉంటోందని అందరికీ తెలిసిన వాస్తవమే. ఈ నేపథ్యంలో తమ ఆవేదనను బహిరంగంగా వ్యక్తం చేసిన నటీమణుల జాబితాలో తాజాగా యంగ్ హీరోయిన్ డింపుల్ హయాతి చేరింది. అయితే ఆమె వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఆమె కెరీర్ ప్రారంభం నుంచి కొన్ని సినిమాల్లో బోల్డ్ మరియు గ్లామర్ పాత్రలు చేసిన నేపథ్యం ఉంది. ఇప్పుడు ఇతర హీరోయిన్ల గ్లామర్ పాత్రలను ప్రశ్నిస్తున్న ఆమెపై –"నువ్వే గ్లామర్ చేస్తూ ఇప్పుడు ఇతరులను జడ్జ్ చేస్తావా?" అనే కోణంలో విమర్శలు వస్తున్నాయి. కానీ అసలు విషయం వేరేగా ఉంది. గ్లామర్ షో మాత్రమే ఆశించే వాతావరణం నుంచి బయటపడి, నటనా నైపుణ్యం చాటుకునే పాత్రలు దొరికితే తాము కూడా చేసి నిరూపించుకుంటామని చెప్పడమే హయతి అసలు ఉద్దేశమట. ఆ సందేశాన్ని అర్థం చేసుకునేవారు తక్కువగా ఉన్నారని అంటోంది. ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడానికి ఒక్కోసారి అనివార్యంగా ఆ మార్గం ఎంచుకున్న తర్వాత, తర్వాత వేరే అవకాశం కోసం మాట్లాడితే అది విమర్శలకు దారి తీయడం –ఇది తెలుగు హీరోయిన్లు ఎదుర్కొంటున్న సంకెళ్ళను మరింత స్పష్టంగా చాటి చెప్తోంది. ఈ చర్చ ఎటు వెళుతుందో చూడాలి.

# అప్పుడు చెప్పిన కథ.. ఇప్పుడిలా..!



*ప్రయోగాలకు కేరాఫ్ అడ్రస్ అయిన ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన కొత్త చిత్రం 'సింగ్ గీతం'. 94 ఏళ్ల వయసులో ఆయన డైరెక్షన్ చేయడం విశేషం. జూన్ 11న సినిమా విడుదల నేపథ్యంలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను చెన్నైలో ఆదివారం నిర్వహించారు. ప్రముఖ నటుడు కమల్ హాసన్ ముఖ్య అతిథిగా హాజరై, సింగీతంతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తమ కాంబినేషన్‌లో వచ్చిన సినిమాల గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "సింగీతం శ్రీనివాసరావుకు సినిమాపై ఎంతో ప్రేమ. ఆ విషయంలో ఇప్పటికీ ఎలాంటి మార్పూ లేదు. నా 21 ఏళ్ల వయసులో ఆయనతో ప్రయాణం మొదలైంది. మా తొలి సినిమా క్యాజువల్ గానే తెరకెక్కింది. తర్వాత నాకు రెండు కథలు చెప్పారు. వాటిలో ఒకటి తెరపైకి వచ్చింది (పుష్పక విమానం). రెండో దాని గురించి 45 ఏళ్లుగా మాట్లాడుకుంటున్నా.. చేయలేకపోయాం. అదే ఈ 'సింగ్ గీతం'. టేక్ 1, టేక్ 2, టేక్ 3 చెప్పినట్టు.. సింగీతానికి ఏజ్ కేవలం నెంబరులాంటిది. కోడంబాక్కం (తమిళనాడు)లో ఉన్నప్పుడు ఆయన పేరును కొందరు సంగీతం అని పలికేవారు. ఇన్నేళ్ల తర్వాత సినిమా పేరుతో సంగీతం కాదు సింగీతం అని స్పష్టత ఇచ్చారాయన (నవ్వుతూ)*

*ఓ స్టార్ హోటల్లో 'పుష్పక విమానం' షూటింగ్ చేశాం. సినిమా అంతా ఏసీలోనే చిత్రీకరించినందుకు గర్వంగా ఉంది (నవ్వులు). ఆ రోజుల్ని చాలా మిస్ అవుతున్నా.. 'ముంబయి ఎక్స్ ప్రెస్' మూవీ షూటింగ్‌ని కూడా బాగా ఎంజాయ్ చేశాం. 720పీలో షూట్ చేసిన ఫస్ట్ డిజిటల్ మూవీ ఇదే. ఆలోచనల్లో జెన్ జీ కన్నా ఒక అడుగు ముందే ఉంటారు సింగీతం. ఆయన్నుంచి ఇంకా నేర్చుకుంటూనే ఉన్నా. ఆయనవద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేయాలని ఉంది. స్టార్స్ ఉంటేనే పెద్ద సినిమా కాదు. పెద్ద సినిమా అంటే గొప్ప ఐడియా ఉండాలి. ఏ సినిమా హిట్ అవుతుంది? ఏది ఫెయిల్ అవుతుంది? అన్నది ఎవరూ చెప్పలేరు" అని పేర్కొన్నారు.*

# ఊరమాస్‌గా బాలయ్య ప్రీలుక్ పోస్టర్

*తన బ్లాక్ బస్టర్ హిట్ దర్శకుడు గోపీచంద్ మలినేని కలయికలో బాలయ్య తన కెరీర్ 111వ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. బాలయ్య మార్క్ స్పీడ్‌తో దూసుకెళుతున్న సినిమా ఇప్పుడు ముంబైలో ఒక యాక్షన్ ఎపిసోడ్‌ని పూర్తి చేసుకుంటుంది. అయితే బాలయ్యని ఈసారి నెవర్ బిఫోర్ లెవెల్లో ప్రెజెంట్ చేస్తుండగా మేకర్స్ అభిమానులకి ఇక వింటేజ్ ట్రీట్ కాదు అంతా కొత్త ట్రీట్‌నే ఉంటుందని ఖరారు చేశారు. ఇలా ఆల్రెడీ జూన్ 10న బాలయ్య పుట్టినరోజు కనుక ట్రీట్‌ని లాక్ చేసేసారు. మరి దీనిపై లేటెస్ట్‌గా వదిలిన ప్రీలుక్ పోస్టర్ మాత్రం ఊరమాస్ లెవెల్లో ఉందని చెప్పాల్సిందే. దీనితో కేజీ గుండ్లు కట్టిన ఇనుప గొలుసులు చేత్తో పట్టుకొని బాలయ్య ఫుల్ యాక్షన్ మోడ్‌లో కనిపిస్తున్నారు. దీనితో గోపీచంద్ మలినేని గత వీరసింహా రెడ్డికి కంప్లీట్ డిఫరెంట్ యాక్షన్ డ్రామాని ప్రామిస్ చేస్తున్నారని చెప్పొచ్చు. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా వృద్ధి సినిమాస్ నిర్మాణం వహిస్తున్నారు.*






# ఓటీటీకి వీరభద్రుడు రెడీ?

తమిళ స్టార్ నటుడు సూర్య హీరోగా నటించిన లేటెస్ట్ సూపర్ హిట్ చిత్రమే 'కరుప్పు'. తెలుగులో వీరభద్రుడుగా వచ్చిన సినిమా సెన్సేషనల్ కంబ్యాక్‌గా సూర్య ఇమేజ్ నిలబెట్టింది. అటు తమిళ్‌లోను ఇటు తెలుగులో కూడా సినిమా భారీ విజయాన్ని సాధించి అదరగొట్టింది. ఇప్పటికీ థియేటర్స్‌లో బాగానే రాణిస్తున్నా.. సినిమాపై లేటెస్ట్‌గా ఓటీటీ హింట్ బయటకి వచ్చింది. ఈ చిత్రాన్ని ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. లేటెస్ట్‌గా వారు సర్ప్రైజ్ హింట్ అందించారు. టైటిల్ ఏదీ పెట్టకుండా 'గాడ్ మోడ్ ఆన్' అంటూ సింపుల్ పోస్టర్‌తో కరుప్పు సినిమాలో డైలాగ్‌తో హింట్ ఇచ్చేసారు. దీనితో వీరభద్రుడు ఓటీటీ రిలీజ్‌కి రెడీ అయిపోయినట్టేనని అర్థమవుతోంది. దాదాపు ఈ వారంలోనే ఓటీటీకి వచ్చే అవకాశం ఉంది. జూన్ 11 లేదా 12న ప్రైమ్ వీడియోలో సినిమా సందడి చేసే అవకాశం ఉందని అంటున్నారు. దీనిపై అధికారిక క్లారిటీ రావాల్సి ఉంది. చిత్రానికి సాయి అభ్యంకర్ సంగీతం అందించగా డ్రీమ్ వారియర్ పిక్చర్స్ నిర్మాణం వహించిన సంగతి తెలిసిందే.